తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
వరంగల్ | సోమవారం - 25 - మే - 2026 | సంపుటి : 3 | సంచిక : 357 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in




# రేవంత్‌ను కలిసిన విశ్వనాథన్

## మర్యాదపూర్వకంగా భేటీ అయిన తమిళనాడు మంత్రి
## శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి
## ఆత్మీయంగా సత్కరించిన రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, మే 24 (తెలంగాణ ముచ్చట్లు):**

ఇటీవల తమిళనాడు ప్రభుత్వంలో మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన పీ. విశ్వనాథన్ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిను మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ భేటీ స్నేహపూర్వక వాతావరణంలో కొనసాగింది. ఇరు రాష్ట్రాల నాయకులు పరస్పరం ఆత్మీయ అభినందనలు తెలియజేసుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, విశ్వనాథన్‌ను ఘనంగా సత్కరించారు. తమిళనాడు మంత్రివర్గంలో చోటు దక్కించుకున్నందుకు ఆయనకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా సేవలో మరింత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. సమావేశంలో పరస్పర గౌరవం, సాన్నిహిత్యం స్పష్టంగా కనిపించింది. తమిళనాడులో ఇటీవల జరిగిన రాజకీయ పరిణామాల అనంతరం విశ్వనాథన్‌కు మంత్రివర్గంలో అవకాశం లభించింది.

మిగతా 2లో..



# స్మార్ట్ మీటర్లకు కేబినెట్ ఆమోదం

## ఆర్‌డీఎస్‌ఎస్ పథకంలో తెలంగాణ చేరిక
## వ్యవసాయ కనెక్షన్లకు మినహాయింపు
## వినియోగదారులపై భారం లేదన్న ప్రభుత్వం

**హైదరాబాద్, మే 24 (తెలంగాణ ముచ్చట్లు):**

రాష్ట్రంలో వ్యవసాయ కనెక్షన్లు మినహా అన్ని విద్యుత్ కనెక్షన్లకు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన శనివారం జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రీవ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్‌లో చేరేందుకు ఆమోదం తెలిపారు. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా గృహ, వాణిజ్య విద్యుత్ కనెక్షన్లకు దశలవారీగా స్మార్ట్ మీటర్లు ఏర్పాటు కానున్నాయి. కేబినెట్ సమావేశం అనంతరం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఈ వివరాలను వెల్లడించారు. విద్యుత్ పంపిణీ వ్యవస్థను మరింత సమర్థవంతంగా మార్చడం, విద్యుత్ నష్టాలను తగ్గించడం, డిస్కంల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడం ఈ పథకం ప్రధాన లక్ష్యమని తెలిపారు.

మిగతా 2లో..

# కాంగ్రెస్‌పై కేటీఆర్ విమర్శలు

- ప్రీపెయిడ్ మీటర్లపై ఆగ్రహం
- ఉచిత విద్యుత్తు రద్దు కుట్ర అంటూ ఆరోపణలు
- అంబర్‌పేట సమావేశంలో కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు

**హైదరాబాద్, మే 24 (తెలంగాణ ముచ్చట్లు):**

రాష్ట్రంలో ప్రీపెయిడ్ విద్యుత్ మీటర్లు తీసుకురావాలన్న కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయంపై భారత్ రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. అంబర్‌పేటలో జరిగిన పార్టీ నియోజకవర్గ సమావేశంలో

మిగతా 2లో..






# ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష

## మంత్రులతో వీడియో కాన్ఫరెన్స్
## మే చివరికి కొనుగోళ్లు పూర్తి చేయాలని ఆదేశాలు
## రైతులకు వేగంగా చెల్లింపులు చేస్తున్న ప్రభుత్వం

**హైదరాబాద్, మే 24 (తెలంగాణ ముచ్చట్లు):**

రాష్ట్రంలో యాసంగి ధాన్యం కొనుగోళ్లపై తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పాల్గొన్నారు. ధాన్యం కొనుగోళ్ల పురోగతి, రైతులకు చెల్లింపులు, సన్‌ఫ్లవర్ పంట కొనుగోళ్ల ఏర్పాట్లపై సమగ్రంగా చర్చించారు.

యాసంగి ధాన్యం కొనుగోళ్లను అనేక సవాళ్ల మధ్య విజయవంతంగా నిర్వహిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ఈ సందర్భంగా భట్టి విక్రమార్క అభినందించారు. ప్రజా ప్రభుత్వ పాలనలో రైతులకు గంటల వ్యవధిలోనే ధాన్యం చెల్లింపులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. రైతులు ఇబ్బందులు పడకుండా కొనుగోలు ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. మే నెలాఖరు నాటికి రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లు వంద శాతం పూర్తి చేయాలని సమావేశంలో అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. తేమ శాతం, రవాణా, చెల్లింపుల వంటి అంశాల్లో ఆలస్యం జరగకుండా ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ఇటీవల రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిన సన్‌ఫ్లవర్ పంట కొనుగోళ్లకు తక్షణమే అవసరమైన ఏర్పాట్లు చేయాలని సమావేశంలో సూచించారు. రైతులకు గిట్టుబాటు ధర లభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు. వ్యవసాయ రంగానికి ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

మిగతా 2లో..



# రైతు గోస యాత్ర ప్రారంభం



## వడ్ల కొనుగోలు కేంద్రాల వద్ద బీజేపీ కార్యక్రమం
## రేవంత్‌రెడ్డిపై రఘునందన్‌రావు విమర్శలు
## రైతులతో నేరుగా మాట్లాడతామన్న బీజేపీ

**హైదరాబాద్, మే 24 (తెలంగాణ ముచ్చట్లు):**

రాష్ట్రంలోని వడ్ల కొనుగోలు కేంద్రాల వద్ద రేపటి నుంచి "రైతు గోస బీజేపీ భరోసా" పేరుతో ప్రత్యేక యాత్ర చేపట్టనున్నట్లు బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు వెల్లడించారు.
ఈ యాత్రలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కొనుగోలు కేంద్రాలను సందర్శిస్తూ రైతుల సమస్యలను తెలుసుకోనున్నట్లు తెలిపారు. బీజేపీకి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పెద్ద ఎత్తున పాల్గొంటారని పేర్కొన్నారు. రైతులకు జరుగుతున్న అన్యాయాలను ప్రత్యక్షంగా పరిశీలించడమే ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు తప్పుడు సమాచారం ఇస్తోందని రఘునందన్‌రావు ఆరోపించారు. రాష్ట్రంలో ఎనభై శాతం ధాన్యం కొనుగోలు జరిగిందని ప్రభుత్వం చెబుతోందని, అయితే నిజంగా ఆ స్థాయిలో కొనుగోళ్లు ఎక్కడ జరిగాయో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అధికారులు ఇచ్చిన నివేదికలను మాత్రమే నమ్మి ప్రజలకు తప్పుదారి పట్టించే ప్రకటనలు చేయడం సరికాదన్నారు.

మిగతా 2లో..

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# రేవంత్‌ను కలిసిన విశ్వనాథన్

(మొదటి పేజీ తరువాయి)

ఈ నేపథ్యంలో ఆయన తెలంగాణ పర్యటనకు రావడం ప్రాధాన్యత సంతరించుకుంది. దక్షిణ భారత రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు కొనసాగడం అభినందనీయమని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. భేటీ సందర్భంగా ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు, పరిపాలనా అంశాలపై కూడా చర్చ జరిగినట్లు సమాచారం. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వాలు చేపడుతున్న చర్యలపై నాయకులు అభిప్రాయాలు పంచుకున్నట్లు తెలిసింది. ఇరు రాష్ట్రాల మధ్య పరస్పర సహకారం మరింత బలపడాలని ఆకాంక్ష వ్యక్తమైంది. ఈ సమావేశం సందర్భంగా పలువురు అధికారులు, నాయకులు కూడా హాజరైనట్లు సమాచారం. విశ్వనాథన్‌కు తెలంగాణ నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజా సేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. సమావేశం మొత్తం ఆత్మీయతతో కొనసాగింది. భవిష్యత్తులో కూడా ఇరు రాష్ట్రాల మధ్య స్నేహపూర్వక సంబంధాలు కొనసాగాలని నాయకులు ఆకాంక్షించారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వాల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా పరస్పర గౌరవంతో ముందుకు సాగడం మంచి పరిణామమని అభిప్రాయపడ్డారు.

# స్మార్ట్ మీటర్లకు కేబినెట్ ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

విద్యుత్ వినియోగాన్ని పారదర్శకంగా పర్యవేక్షించేందుకు స్మార్ట్ మీటర్లు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ పథకంలో చేరడం కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా తీసుకున్న నిర్ణయం కాదని మంత్రి స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే కేంద్ర విద్యుత్ శాఖ, తెలంగాణ ప్రభుత్వం, విద్యుత్ పంపిణీ సంస్థల మధ్య త్రైపాక్షిక ఒప్పందం కుదిరిందని గుర్తుచేశారు. అయితే అప్పటి ప్రభుత్వం ఆ ప్రక్రియను పూర్తి చేయలేదని, అసెంబ్లీలో సుదీర్ఘ చర్చల అనంతరం ప్రస్తుతం తాము నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు అయ్యే మొత్తం వ్యయాన్ని ప్రభుత్వాలే భరిస్తాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇందులో 60 శాతం వ్యయాన్ని కేంద్ర ప్రభుత్వం, 40 శాతం వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని అధికారులు వెల్లడించారు. వినియోగదారులపై ఎలాంటి అదనపు ఆర్థిక భారం ఉండదని స్పష్టం చేశారు. ముఖ్యంగా వ్యవసాయ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసే ప్రసక్తే లేదని మంత్రి పొంగులేటి మరోసారి తేల్చిచెప్పారు. డిస్కంల ఆదాయ, వ్యయాల మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించి విద్యుత్ సంస్థలను ఆర్థికంగా బలోపేతం చేయడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమని అధికారులు పేర్కొన్నారు. స్మార్ట్ మీటర్ల ద్వారా విద్యుత్ వినియోగంపై ఖచ్చితమైన సమాచారం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. అలాగే విద్యుత్ చోరీలను అరికట్టడం, బిల్లింగ్ వ్యవస్థను మెరుగుపరచడం వంటి ప్రయోజనాలు కూడా ఉంటాయని వివరించారు. విద్యుత్ ఛార్జీల పెంపు అంశం పూర్తిగా రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి పరిధిలోనే ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు, విద్యుత్ ఛార్జీల పెంపునకు ఎలాంటి ప్రత్యక్ష సంబంధం లేదని పేర్కొన్నారు. ప్రజల్లో అపోహలు రాకుండా ప్రభుత్వం స్పష్టమైన అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోనుందని తెలిపారు.


# కాంగ్రెస్‌పై కేటీఆర్ విమర్శలు

(మొదటి పేజీ తరువాయి)

పాల్గొన్న ఆయన, వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టడం ద్వారా రైతులకు అందుతున్న ఉచిత విద్యుత్తును రద్దు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. ప్రీపెయిడ్ మీటర్ల పేరుతో విద్యుత్ రంగాన్ని ప్రైవేట్ సంస్థలకు అప్పగించే ప్రయత్నం జరుగుతోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజా వ్యతిరేకమని కేటీఆర్ విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఇంట్లో ప్రస్తుతం ఉన్న విద్యుత్ మీటర్లను తొలగించి ప్రీపెయిడ్ మీటర్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తోందన్నారు. ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. గ్రామాలు, పట్టణాలు, వ్యవసాయ రంగం అన్న తేడా లేకుండా అందరికీ ప్రీపెయిడ్ మీటర్లు తీసుకురావాలని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ప్రీపెయిడ్ మీటర్ల వ్యవస్థ అమల్లోకి వస్తే ప్రజలపై భారీ ఆర్థిక భారం పడుతుందని కేటీఆర్ అన్నారు. ఉచిత కరెంట్‌ను పూర్తిగా తొలగించేందుకు ఇదే మొదటి అడుగని విమర్శించారు. గతంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఒత్తిడి చేసినా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రీపెయిడ్ మీటర్లను అంగీకరించలేదని గుర్తుచేశారు. రూ.30 వేల కోట్ల రుణం నిలిపివేసినా కేసీఆర్ వెనక్కి తగ్గలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అదానీ, అంబానీ వంటి ప్రైవేట్ సంస్థలకు విద్యుత్ రంగాన్ని అప్పగించాలనే లక్ష్యంతోనే ఈ నిర్ణయాలు తీసుకుంటోందని కేటీఆర్ ఆరోపించారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీ కరెంటు కుట్రలను అర్థం చేసుకుని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. మోటార్లకు మీటర్లు రాకముందే, ప్రతి ఇంట్లో ప్రీపెయిడ్ మీటర్లు అమర్చకముందే కాంగ్రెస్ పార్టీకి ప్రజలు రాజకీయంగా గుణపాఠం చెప్పాలని కోరారు. ఈ సందర్భంగా హైదరాబాద్ నగర అభివృద్ధి, మూసీ ప్రక్షాళన, ఫ్యూచర్ సిటీ వంటి అంశాలపై కూడా కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. ప్రస్తుతం ఉన్న హైదరాబాద్ నగరాన్ని సక్రమంగా నిర్వహించలేని ప్రభుత్వం ఫ్యూచర్ సిటీ పేరుతో ప్రజలను మోసం చేస్తోందన్నారు. మూసీ ప్రక్షాళన పేరుతో భారీ స్థాయిలో అవినీతి జరిగే అవకాశముందని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ఎస్టీపీల నిర్మాణం, ఇతర పనులు ప్రారంభమయ్యాయని గుర్తుచేశారు. పార్టీ బలోపేతం కోసం త్వరలో సభ్యత్వ నమోదు అనంతరం శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని కేటీఆర్ తెలిపారు. ప్రతి నియోజకవర్గం నుంచి వెయ్యి మందికి పైగా కార్యకర్తలకు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నర సంవత్సరాల పాలనలో ప్రజలకు చేసిన అన్యాయాలు, ఇచ్చిన హామీల అమలు వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని పేర్కొన్నారు. రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రజా సమస్యలపై పోరాటం చేసిన వారికే పార్టీ టికెట్లు ఇస్తామని స్పష్టం చేశారు.

# రైతు గోస యాత్ర ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)



ముఖ్యమంత్రి స్వయంగా ఏదైనా జిల్లాకు వెళ్లి కొనుగోలు కేంద్రాల వద్ద రైతులతో మాట్లాడితే అసలు పరిస్థితులు తెలుస్తాయని రఘునందన్‌రావు సూచించారు. క్షేత్ర స్థాయిలో రైతులు పడుతున్న ఇబ్బందులు ప్రభుత్వానికి తెలియడం లేదన్నారు. వడ్ల కొనుగోళ్లలో ఆలస్యం, తేమ శాతం పేరుతో ఇబ్బందులు, చెల్లింపుల జాప్యం వంటి సమస్యలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆరోపించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ యాత్రలో రైతులతో నేరుగా మాట్లాడించి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను బయటపెడతామని ఆయన తెలిపారు. తమ ఉద్దేశ్యం రాజకీయాలు చేయడం కాదని, రైతుల సంక్షేమం కోసం పోరాడటమే లక్ష్యమని స్పష్టం చేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం ఒత్తిడి తీసుకువస్తామని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన హామీలను ఇప్పటికీ అమలు చేయకపోవడం బాధాకరమని రఘునందన్‌రావు విమర్శించారు. మేనిఫెస్టోలో పేర్కొన్న పథకాలను కాలయాపన చేయకుండా వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల పట్ల ప్రభుత్వం నిజమైన చిత్తశుద్ధితో వ్యవహరించాలని కోరారు. రైతులు నష్టపోకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ శ్రేణులు ఈ యాత్రలో పాల్గొని రైతుల సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్తాయని రఘునందన్‌రావు తెలిపారు. అన్నదాతల పక్షాన బీజేపీ ఎల్లప్పుడూ నిలుస్తుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

## ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష

(మొదటి పేజీ తరువాయి)

వాయు కాలుష్య నియంత్రణలో భాగంగా గ్రామాల్లో రైతులు పంట అవశేషాలను, ముఖ్యంగా వరి కొయ్యలను కాల్చకుండా విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. రాబోయే 15 నుంచి 30 రోజుల పాటు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి పంట అవశేషాలను కాల్చితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధి విషయంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారిస్తోందని అధికారులు తెలిపారు. కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని సమావేశంలో నిర్ణయించారు.

# రేవంత్‌పై జీవన్‌రెడ్డి విమర్శలు

- ధాన్యం కొనుగోళ్లపై ఆగ్రహం
- రైతుల సమస్యలు పట్టవా అంటూ ప్రశ్న
- ప్రభుత్వం ప్రాధాన్యతలు తప్పాయని విమర్శ



**హైదరాబాద్, మే 24 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలో వరి ధాన్యం కొనుగోళ్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని భారత్ రాష్ట్ర సమితి జనరల్ సెక్రటరీ జీవన్‌రెడ్డి విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అందాల పోటీలు, ఫుట్‌బాల్ మ్యాచ్‌లపై ఉన్న ఆసక్తి రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయడంలో కనిపించడం లేదని మండిపడ్డారు. రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్రంలోని కొనుగోలు కేంద్రాల్లో రైతులు రోజుల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొందని జీవన్‌రెడ్డి ఆరోపించారు. ధాన్యం కొనుగోళ్లలో జాప్యం కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. వర్షాలు పడే అవకాశం ఉండటంతో రైతులు తమ పంటను కాపాడుకోవడానికి ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించాల్సిన సమయంలో ప్రభుత్వం ఇతర కార్యక్రమాలపై ఎక్కువ దృష్టి పెడుతోందని జీవన్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు రైతులే వెన్నెముక అని, అలాంటి రైతుల పట్ల నిర్లక్ష్య ధోరణి సరికాదన్నారు. కొనుగోలు కేంద్రాల్లో కనీస సదుపాయాలు కూడా లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. వరి ధాన్యం కొనుగోళ్లపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణతో ముందుకు రావాలని ఆయన కోరారు. రైతులకు సకాలంలో చెల్లింపులు చేయడంతో పాటు తేమ శాతం పేరుతో ఇబ్బందులు కలిగించకూడదన్నారు. వ్యవసాయ రంగాన్ని కాపాడాలంటే రైతులకు న్యాయం చేయాల్సిందేనని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితిపై ప్రభుత్వం నిజమైన దృష్టి పెట్టాలని జీవన్‌రెడ్డి సూచించారు. కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర, సకాలంలో కొనుగోలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని గుర్తుచేశారు. రైతుల సమస్యలను విస్మరిస్తే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రాధాన్యత కావాలని జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించి రైతులకు ఉపశమనం కల్పించాలని కోరారు. రాష్ట్రంలోని అన్నదాతల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# సంగారెడ్డిలో దారుణ హత్య



- భర్తను హతమార్చిన భార్య
- జేసీబీతో గొయ్యి తీసి పూడ్చివేత
- తొమ్మిది రోజుల తర్వాత వెలుగులోకి నిజం

**సంగారెడ్డి, మే 24 (తెలంగాణ ముచ్చట్లు):** సంగారెడ్డి జిల్లాలో సంచలనం రేపిన దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. వివాహేతర సంబంధానికి భర్త అడ్డుగా మారుతున్నాడనే కారణంతో భార్య తన ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిన ఘటన నారాయణఖేడ్ మండలం గంగాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. అనంతరం మృతదేహాన్ని జేసీబీ సహాయంతో గొయ్యి తవ్వించి పూడ్చిపెట్టిన విషయం స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ముత్యం రెడ్డి తన కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. అయితే అతని భార్యకు గ్రామానికే చెందిన చింటుతో వివాహేతర సంబంధం ఉన్నట్లు సమాచారం. ఈ విషయం కుటుంబంలో తరచూ గొడవలకు దారితీస్తుండేదని స్థానికులు చెబుతున్నారు. భర్త తమ సంబంధానికి అడ్డుగా మారుతున్నాడని భావించిన ఆమె, ప్రియుడితో కలిసి అతడిని హత్య చేయాలని పథకం వేసినట్లు పోలీసులు వెల్లడించారు. పథకం ప్రకారం ఇద్దరూ కలిసి ముత్యం రెడ్డిని హతమార్చిన అనంతరం నేరాన్ని దాచిపెట్టేందుకు ప్రయత్నించారు. జేసీబీ సహాయంతో గొయ్యి తవ్వించి మృతదేహాన్ని అక్కడే పూడ్చిపెట్టినట్లు విచారణలో తేలింది. తర్వాత భర్త కనిపించడం లేదంటూ భార్య పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

మొదట్లో కనిపించకుండా పోయిన కేసుగా భావించిన పోలీసులు అనుమానాస్పద పరిస్థితులను గమనించి విచారణను ముమ్మరం చేశారు. భార్య ప్రవర్తనపై అనుమానం వచ్చిన పోలీసులు తమదైన శైలిలో విచారించగా అసలు విషయం బయటపడింది. ఘటన జరిగిన తొమ్మిది రోజుల తర్వాత నిందితులు నేరాన్ని ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనతో గంగాపూర్ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరవుతున్నారు. వివాహేతర సంబంధాల కారణంగా కుటుంబాలు నాశనం అవుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. నిందితులైన భార్య, ఆమె ప్రియుడిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు సేకరిస్తున్నామని, కేసులో అన్ని కోణాల్లో విచారణ కొనసాగుతోందని పోలీసులు వెల్లడించారు.

# హైదరాబాదుకు కొత్త పారిశ్రామిక విధానం



- హెచ్ఐఎల్‌టీపీ ఆన్‌లైన్ పోర్టల్ ప్రారంభం
- కాలుష్య పరిశ్రమల తరలింపుకు చర్యలు
- స్వచ్ఛ నగరంగా మార్చడమే లక్ష్యం

**హైదరాబాద్, మే 24 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు శనివారం సచివాలయంలో హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీకు సంబంధించిన ఆన్‌లైన్ పోర్టల్‌ను ప్రారంభించారు. నగర అభివృద్ధికి అనుగుణంగా పరిశ్రమల పునర్వ్యవస్థీకరణ చేపట్టేందుకు ఈ విధానం కీలకంగా మారనుంది. ముఖ్యంగా హైదరాబాద్ ప్రధాన పట్టణ ప్రాంతంలో ఉన్న కాలుష్యకారక పరిశ్రమలను దశలవారీగా తరలించేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. హైదరాబాద్ నగరాన్ని పరిశుభ్రమైన, పచ్చదనంతో నిండిన ఆధునిక నగరంగా తీర్చిదిద్దడమే ఈ విధానం ప్రధాన లక్ష్యమని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. వేగంగా విస్తరిస్తున్న నగర పరిధిలో కాలుష్యాన్ని తగ్గించేందుకు పరిశ్రమల పునర్వ్యవస్థీకరణ అవసరమని పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని వివరించారు. హెచ్ఐఎల్‌టీపీ విధానం ద్వారా పరిశ్రమల తరలింపు ప్రక్రియను పారదర్శకంగా, పరిశ్రమలకు అనుకూలంగా అమలు చేస్తామని మంత్రి వెల్లడించారు. పరిశ్రమల యజమానులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తులు చేసుకునేలా ప్రత్యేక పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. ఈ విధానం ద్వారా పరిశ్రమలకు స్పష్టమైన మార్గదర్శకాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. నగర కేంద్ర ప్రాంతాల్లో ఉన్న కాలుష్యకారక పరిశ్రమల వల్ల పర్యావరణంపై తీవ్ర ప్రభావం పడుతోందని అధికారులు పేర్కొన్నారు. వాయు కాలుష్యం, నీటి కాలుష్యం వంటి సమస్యలను తగ్గించేందుకు పరిశ్రమలను నగర పరిధి బయటకు తరలించడం అవసరమని నిపుణులు సూచిస్తున్నారని వెల్లడించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం దీర్ఘకాలిక ప్రణాళికతో ముందుకు సాగుతోందని తెలిపారు. హైదరాబాద్‌ను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేయడంలో ఈ విధానం కీలక పాత్ర పోషిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. పరిశ్రమల తరలింపుతో పాటు కొత్త పారిశ్రామిక మండలాల అభివృద్ధి, ఆధునిక మౌలిక వసతుల కల్పన వంటి అంశాలపై కూడా ప్రభుత్వం దృష్టి సారించినట్లు సమాచారం. నగరంలో జీవన ప్రమాణాలు మెరుగుపడటానికి ఈ చర్యలు దోహదపడతాయని అధికారులు పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు కాలుష్య రహిత హైదరాబాద్‌ను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. పర్యావరణ పరిరక్షణతో పాటు పరిశ్రమల అభివృద్ధికి కూడా సమాన ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ప్రజల ఆరోగ్యం, నగర సుస్థిర అభివృద్ధి దృష్ట్యా ఈ విధానం కీలక నిర్ణయంగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.



## మరణానంతరం ఇద్దరికి చూపునిచ్చిన రావికంటి రాజయ్య నేత్రదానం

**జమ్మికుంట టౌన్ మే 24 (తెలంగాణ ముచ్చట్లు):** కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని కొండూరి కాంప్లెక్స్ నివాసి రావికంటి రాజయ్య (80) వృద్ధాప్యంతో మృతి చెందారు. ఆయన మరణానంతరం కుటుంబ సభ్యులు గొప్ప మనసుతో నేత్రదానానికి ముందుకు రావడంతో ఇద్దరు అంధులకు చూపు ప్రసాదించే మహత్తర సేవ జరిగింది.

డీలర్ గర్రెపల్లి వెంకటేశ్వర్లు నేత్రదానంపై కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించగా, వారు వెంటనే అంగీకారం తెలిపారు. అనంతరం సదాశయ ఫౌండేషన్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు మచ్చగిరి నరహరి ఆధ్వర్యంలో, వరంగల్ ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ నరేందర్ సహకారంతో నేత్రాలను సేకరించి హైదరాబాద్ ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్‌కు తరలించారు.

కీర్తిశేషులు రావికంటి రాజయ్య నేత్రదానం ద్వారా ఇద్దరు అంధులకు వెలుగు నిచ్చారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుమారులు, కోడళ్లు రావికంటి నీలకంఠంశ్రీలత, వెంకటేశ్వర్లునీరజ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సహకరించిన గర్రెపల్లి వెంకటేశ్వర్లు, చిటి కేసి శివానందయ్య, ముత్యాల జగదీశ్వర్, చిదురాల శ్రీనివాస్, వంగల రమేష్‌లతో పాటు సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, జాతీయ కార్యదర్శి డాక్టర్ భీష్మాచారి, జిల్లా అధ్యక్షుడు మచ్చగిరి నరహరి, ముఖ్య సలహాదారులు నూక రమేష్, గౌరవ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, ప్రచార కార్యదర్శి వాసు, లగిశెట్టి చంద్రమౌళి తదితరులు కుటుంబ సభ్యులను అభినందిస్తూ సంతాపం తెలిపారు.



## ఖాదర్ బాబాకు టీడబ్ల్యూజేఎఫ్ సన్మానం

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గా బాధ్యతల స్వీకారం
- పఠనాసక్తి పెంపొందించేలా లైబ్రరీలను తీర్చిదిద్దాలని సూచన

**ఖమ్మం బ్యూరో, మే 24(తెలంగాణ ముచ్చట్లు ):**ఖమ్మం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గా ఆదివారం బాధ్యతలు స్వీకరించిన ఎండీ ఖాదర్ బాబాను తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్ హెచ్ 2843) ఖమ్మం జిల్లా కమిటీ సన్మానించింది. స్థానిక పాత మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన చైర్మన్ చాంబర్‌లో యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ ఖదీర్, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షులు దువ్వా సాగర్, జర్నలిస్టు అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు నలుబోల మధులత, అర్షద్, యూనియన్ నాయకులు కొరకొప్పుల రాంబాబు, తదితరులు చైర్మన్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. యూనియన్ జ్ఞాపిక, డైరీని అందజేసి శాలువ కప్పి సన్మానించారు. పఠనాసక్తిని పెంపొందించేలా జిల్లాలోని గ్రంథాలయాలను తీర్చిదిద్దాలని సూచించారు. పత్రికలన్నీ గ్రంథాలయాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రంథాలయాల్లో వసతులు మెరుగుపర్చాలని, డిజిటల్ లైబ్రరీలుగా తీర్చిదిద్దాలని విజ్ఞప్తి చేశారు.

# అమరుల త్యాగాలతో ఏర్పడిన తెలంగాణను మరవొద్దు

**ఎల్కతుర్తి, మే 24 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ ఉద్యమంలో అమరులైన వారి త్యాగాలను ప్రభుత్వం గుర్తించి ఉద్యమకారులకు తగిన న్యాయం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి నిమ్మల మనోహర్ డిమాండ్ చేశారు. ఎల్కతుర్తి మండలంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల కమిటీ ఏర్పాటు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

ఈ సందర్భంగా మండల కమిటీని ప్రకటించారు. మండల అధ్యక్షుడిగా పుట్ట ప్రతాప్, ప్రధాన కార్యదర్శిగా మర్రి అమరేందర్, ఉపాధ్యక్షుడిగా మేకల రాజయ్య, సహాయ కార్యదర్శిగా వంగ రమేష్, కోశాధికారిగా జూపాక శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు.

నిమ్మల మనోహర్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ తొలి దశ 1969లో ప్రారంభమై వందలాది మంది ప్రాణత్యాగాలు చేశారని, రెండో దశ ఉద్యమంలో కూడా వేలాది మంది ఉద్యమకారులు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడారని గుర్తు చేశారు.






వారి త్యాగాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు.

అయితే ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన కుటుంబాలకు ఇప్పటికీ పూర్తిస్థాయి న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమంలో అమరులైన కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలు, రూ.10 లక్షల ఆర్థిక సహాయం, పెన్షన్ కల్పించాలని డిమాండ్ చేశారు.

అలాగే ఉద్యమ సమయంలో పాటలు, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చిన కళాకారులను కూడా ప్రభుత్వం గుర్తించాలని కోరారు. వేలాది మంది కళాకారులు ఉద్యమంలో పాల్గొన్నప్పటికీ కొద్ది మందికే పెన్షన్లు అందుతున్నాయని తెలిపారు. తుక్కుగూడ సభలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల ప్రకారం ప్రతి ఉద్యమకారునికి 250 గజాల ఇంటి స్థలం, నెలకు రూ.25 వేల పెన్షన్, హెల్త్ కార్డు, బస్సు మరియు రైలు పాస్ వంటి సౌకర్యాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పుట్ట ప్రతాప్, కార్యదర్శి అమరేందర్, ఉపాధ్యక్షుడు మేకల రాజయ్య, కార్యదర్శి రమేష్, కోశాధికారి జూపాక శ్రీనివాస్, కమలాబాయి, శ్రీలత, వజ్రమ్మ, విజ్జమ్మ, భాగ్యమ్మ, శాంతమ్మ, మేకల రాజకుమారి, పల్లె సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయాల చైర్మన్ ను సన్మానించిన మైనార్టీ గ్రామీణ వైద్యులు



**ఖమ్మం బ్యూరో, మే 24(తెలంగాణ ముచ్చట్లు ):** ఆదివారం ఎస్ఆర్ గార్డెన్ జరిగిన అభినందన సభలో జిల్లా గ్రంథాలయ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎండి ఖాదర్ బాబా కి మైనారిటీ గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో ఘన సన్మానం చేయబడినది ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు షేక్ హసన్, జిల్లా అధ్యక్షులు షేక్ హసన్ ,జిల్లా వ్యవస్థాపక అధ్యక్షులు షేక్ నజీరుద్దీన్ ,జిల్లా జనరల్ సెక్రెటరీ షేక్ జానీ మియా, జిల్లా ఎగ్జిక్యూటివ్ నెంబర్ షేక్ మన్సూర్ అలీ, జాయింట్ సెక్రెటరీ ఆశ, ఉపాధ్యక్షులు ఖాసిం ,చాంద్ పాషా, అమీర్ ,శ్రీరామ్ గిరి జానీ, ఖలీల్ ,సొందు మియా ,కాజా మియా,రహీం ,ఇమామ్ ,అఫ్జల్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# బెంగళూరులో కిషన్‌రెడ్డి సమీక్ష

- గనుల సంస్థల అధికారులతో కీలక సమావేశం
- ప్రాజెక్టుల పురోగతిపై చర్చ
- సమస్యల పరిష్కారానికి ఆదేశాలు



**బెంగళూరు, మే 24 (తెలంగాణ ముచ్చట్లు):** కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి శనివారం బెంగళూరులో కీలక సమీక్ష సమావేశం నిర్వహించారు. భారత భూగర్భ సర్వే సంస్థ, జాతీయ రాక్ మెకానిక్స్ సంస్థ, భారత గనుల బ్యూరో, భారత్ గోల్డ్ మైన్స్ లిమిటెడ్ సంస్థలకు చెందిన ఉన్నతాధికారులతో కలిసి వివిధ ప్రాజెక్టుల పురోగతిపై సమగ్రంగా చర్చించారు. దేశవ్యాప్తంగా కొనసాగుతున్న గనుల అన్వేషణ కార్యక్రమాలపై సమావేశంలో విస్తృత స్థాయిలో సమీక్ష జరిగింది. ఈ సమావేశంలో ప్రధానంగా వివిధ రాష్ట్రాల్లో కొనసాగుతున్న అన్వేషణ పనుల పరిస్థితి, వాటి అమలులో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలు, పరిపాలనా ఆటంకాలపై అధికారులు మంత్రికి వివరించారు. ప్రాజెక్టులు వేగంగా పూర్తికావడానికి అవసరమైన చర్యలపై కూడా చర్చించారు. అనుమతుల ఆలస్యం, సాంకేతిక సవాళ్లు వంటి అంశాలు పనుల పురోగతిని ప్రభావితం చేస్తున్నాయని అధికారులు వెల్లడించారు.

భారత భూగర్భ సర్వే సంస్థ చేపడుతున్న ఖనిజాల అన్వేషణ కార్యక్రమాలపై మంత్రి కిషన్‌రెడ్డి ప్రత్యేకంగా వివరాలు తెలుసుకున్నారు. జాతీయ రాక్ మెకానిక్స్ సంస్థ నిర్వహిస్తున్న పరిశోధనలు, గనుల భద్రతకు సంబంధించిన అధ్యయనాలపై కూడా సమీక్ష నిర్వహించారు. అలాగే భారత గనుల బ్యూరో ఆధ్వర్యంలో అమలవుతున్న పర్యవేక్షణ చర్యలపై అధికారులతో చర్చించారు. భారత్ గోల్డ్ మైన్స్ లిమిటెడ్ చేపడుతున్న ప్రాజెక్టుల పరిస్థితిని కూడా మంత్రి సమీక్షించారు. గనుల రంగం దేశ ఆర్థికాభివృద్ధికి ఎంతో కీలకమని పేర్కొన్న ఆయన, ఖనిజ వనరుల సమర్థ వినియోగానికి ఆధునిక సాంకేతికత అవసరమని సూచించారు. అన్వేషణ కార్యక్రమాలు మరింత వేగవంతం కావాలంటే సంబంధిత సంస్థలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సమావేశంలో భద్రతా ప్రమాణాల అమలు అంశంపై కూడా మంత్రి ప్రత్యేక దృష్టి సారించారు. గనుల అన్వేషణ, తవ్వకాల కార్యక్రమాల్లో కార్మికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. సాంకేతిక సమస్యలను త్వరితగతిన పరిష్కరించి ప్రాజెక్టులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. సమావేశం ముగింపులో దేశ గనుల రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. వివిధ రాష్ట్రాల్లో కొనసాగుతున్న ప్రాజెక్టులు ప్రజలకు ఉపయోగపడేలా పారదర్శకంగా అమలు కావాలని తెలిపారు. గనుల రంగ అభివృద్ధి ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ మరింత బలపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

# సహజ సంపదల ఖండం

- అభివృద్ధి కోసం ఆఫ్రికా ప్రయాణం
- ఐక్యతతో ముందుకు సాగుతున్న ఆఫ్రికా దేశాలు
- వలస పాలన నుంచి అభివృద్ధి దిశగా కొత్త అడుగులు
- ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో పెరుగుతున్న ఆఫ్రికా ప్రాధాన్యం




**డెస్క్, మే 24 (తెలంగాణ ముచ్చట్లు):** సహజ సంపదలు, విభిన్న సంస్కృతులు, విస్తారమైన భౌగోళిక వైవిధ్యంతో ప్రపంచంలో ప్రత్యేక గుర్తింపు పొందిన ఆఫ్రికా ఖండం అభివృద్ధి దిశగా కొత్త అడుగులు వేస్తోంది. ఆఫ్రికా దేశాల ఐక్యత, స్వాతంత్ర్య పోరాటాలు, ఆర్థిక పురోగతిని గుర్తు చేసుకుంటూ ప్రతి సంవత్సరం మే 25ను “ఆఫ్రికా దినోత్సవం”గా నిర్వహిస్తున్నారు. ఈ రోజు ఆఫ్రికా దేశాల మధ్య ఐక్యతను బలోపేతం చేయడమే కాకుండా ప్రపంచానికి ఆ ఖండం ప్రాధాన్యాన్ని గుర్తు చేస్తోంది. ఆఫ్రికా దినోత్సవానికి చారిత్రక ప్రాధాన్యం ఉంది. 1963లో ఆఫ్రికా దేశాలు కలిసి “ఆర్గనైజేషన్ ఆఫ్ ఆఫ్రికన్ యూనిటీ”ను ఏర్పాటు చేశాయి. అదే తరువాత ఆఫ్రికన్ యూనియన్‌గా మారింది. వలస పాలన నుంచి విముక్తి పొందిన దేశాలు ఐక్యంగా అభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో ఈ సంస్థ ఏర్పడింది. ఒకప్పుడు పేదరికం, అంతర్గత ఘర్షణలు, ఆకలి సమస్యలతో వార్తల్లో నిలిచిన ఆఫ్రికా ఇప్పుడు ఆర్థికాభివృద్ధి దిశగా వేగంగా ముందుకు సాగుతోంది. సహజ వనరులు, యువ జనాభా, వ్యవసాయం, ఖనిజ సంపద కారణంగా ప్రపంచ పెట్టుబడిదారుల దృష్టి ఆఫ్రికాపై పెరుగుతోంది. ప్రపంచానికి అవసరమైన బంగారం, వజ్రాలు, చమురు, కోబాల్ట్, లిథియం వంటి విలువైన ఖనిజాలు ఆఫ్రికాలో విస్తారంగా ఉన్నాయి. ముఖ్యంగా విద్యుత్ వాహనాల తయారీలో అవసరమైన ఖనిజాల కారణంగా ఆఫ్రికా ప్రాధాన్యం మరింత పెరుగుతోంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఈ ఖండం కీలక పాత్ర పోషించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇటీవలి కాలంలో ఆఫ్రికా దేశాలు సాంకేతిక రంగంలో కూడా వేగంగా ఎదుగుతున్నాయి. మొబైల్ బ్యాంకింగ్, డిజిటల్ సేవలు, స్టార్టప్ సంస్థలు కొత్త అవకాశాలను సృష్టిస్తున్నాయి. యువత ఆధారంగా ఆవిష్కరణలకు ఆఫ్రికా కేంద్రంగా మారుతోందని నిపుణులు చెబుతున్నారు. అయితే అభివృద్ధి ప్రయాణంలో ఇంకా అనేక సవాళ్లు కొనసాగుతున్నాయి. పేదరికం, నిరుద్యోగం, ఆరోగ్య సమస్యలు, రాజకీయ అస్థిరత కొన్ని దేశాల్లో ఇప్పటికీ తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. వాతావరణ మార్పుల ప్రభావంతో కరువు పరిస్థితులు కూడా అనేక ప్రాంతాల్లో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి.

ఆఫ్రికా ఖండం సాంస్కృతిక వైవిధ్యానికి కూడా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉంది. వందలాది భాషలు, సంప్రదాయాలు, సంగీతం, నృత్య రూపాలు ఆఫ్రికా ప్రత్యేకతగా నిలుస్తున్నాయి. ప్రపంచ కళా సంస్కృతిపై కూడా ఆఫ్రికా ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ప్రపంచ దేశాలతో ఆఫ్రికా సంబంధాలు కూడా వేగంగా మారుతున్నాయి. చైనా, అమెరికా, భారత్, యూరప్ దేశాలు ఆఫ్రికాలో పెట్టుబడులు పెంచుతున్నాయి. మౌలిక వసతులు, విద్య, ఆరోగ్యం, సాంకేతిక రంగాల్లో భాగస్వామ్యాలు పెరుగుతున్నాయి. భారత్‌తో కూడా ఆఫ్రికా దేశాల సంబంధాలు బలపడుతున్నాయి. వాణిజ్యం, ఔషధాలు, విద్య, వ్యవసాయం రంగాల్లో రెండు ప్రాంతాల మధ్య సహకారం పెరుగుతోంది. భారత విద్యాసంస్థల్లో వేలాది ఆఫ్రికా విద్యార్థులు చదువుతున్నారు. అభివృద్ధి భాగస్వామిగా భారత్ ఆఫ్రికాతో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తోంది. ఆఫ్రికా దినోత్సవం ఖండ ఐక్యతను మాత్రమే కాదు, అభివృద్ధి కోసం కలిసి పనిచేసే సంకల్పాన్ని కూడా ప్రపంచానికి తెలియజేస్తోంది. సహజ సంపదలు, యువ శక్తి, సాంకేతిక అవకాశాలను సమర్థంగా వినియోగించుకుంటే భవిష్యత్తులో ఆఫ్రికా ప్రపంచ ఆర్థిక శక్తిగా ఎదిగే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# పేదరికం బలి తీసుకున్న మరో ప్రాణం



**ఎల్కతుర్తి, మే 24 (తెలంగాణ ముచ్చట్లు):** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం వల్భాపూర్ గ్రామంలో పేదరికం మరో ప్రాణాన్ని బలి తీసుకున్న విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన అంబాల మధు (35) అనే దివ్యాంగుడు ఆర్థిక ఇబ్బందులు, అప్పుల బాధలు తాళలేక చికిత్స పొందుతూ మృతి చెందాడు.
మధు తన భార్య, ఇద్దరు చిన్నపిల్లలు, వృద్ధ తల్లిదండ్రులతో కలిసి అత్యంత పేదరికంలో జీవనం సాగించేవాడు. గ్రామంలోని హైస్కూల్ ఎదుట చిన్న కిరాణ దుకాణం నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. అయితే నేషనల్ హైవే, రైల్వే విస్తరణ పనుల కారణంగా ఇల్లు స్థలం కోల్పోవడంతో కుటుంబం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో పడినట్లు గ్రామస్థులు తెలిపారు.
ఇక కుటుంబ సభ్యుల అనారోగ్య సమస్యలు, ఆసుపత్రి ఖర్చులు పెరగడంతో అప్పులు మరింత భారంగా మారాయి. ఈ పరిస్థితులతో తీవ్ర మనస్తాపానికి గురైన మధు వారం రోజుల క్రితం గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆయనను ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.
మధు మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. గ్రామస్థులు కలిసి అంత్యక్రియలకు సహాయం అందించి దహన సంస్కారాలు నిర్వహించారు. ప్రస్తుతం కుటుంబం దిక్కుతోచని స్థితిలో ఉందని, ప్రభుత్వం స్పందించి ఆర్థిక సహాయం అందించడంతో పాటు నివాస స్థలం కల్పించి కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.




# ఎస్ ఐ ఆర్ అవగాహన సదస్సు

**ఖమ్మం బ్యూరో, మే 24(తెలంగాణ ముచ్చట్లు ):** జాతీయ ఎన్నికల కమిషన్ ఆదేశాలతో తెలంగాణ రాష్ట్రంలో జూన్ 25 నుంచి ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభం కానుందని ప్రజలు అప్రమత్తంగా ఉండి తమ ఓటును కాపాడుకోవాలని నాగరిక వికాస్ కేంద్ర రాష్ట్ర సమన్వయకర్త మహమ్మద్ జునేద్ పిలుపునిచ్చారు. ఈరోజు స్థానిక జమాతే ఇస్లామి కార్యాలయంలో నాగరికత వికాస్ కేంద్ర ఖమ్మం యూనిట్ అధ్యక్షులు మొహమ్మద్ ముజీబ్ అధ్యక్షతన జరిగిన ఎస్ ఐ ఆర్ అవగాహన సదస్సులు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఎస్సై ఆర్ ప్రక్రియలో తమ ఏరియా బిఎల్ఓ తో సంప్రదించి చేసుకొని ఓటు హక్కును కాపాడుకోవాలని కోరారు. మరొక అతిథిగా విచ్చేసిన హైదరాబాద్ వెల్ఫేర్ సొసైటీ సెక్రటరీ అబ్దుల్ ఖాలిక్ మాట్లాడుతూ 2002 ఓటర్ లిస్టులో తమ పేరుని గుర్తించి ప్రస్తుత ఓటర్ ఐడి తో బిఎల్ఓ వద్ద ప్రీమ్యాపింగ్ చేసుకొని తమ కుటుంబ సభ్యుల ఓట్లను చేర్చుకోవాలని తెలియజేశారు. ఈ ప్రక్రియ సజావుగా కొనసాగడానికి విద్యావేత్తలు మేధావులు తగిన శ్రద్ధ తీసుకొని ఏ ఒక్క ఓటు డిలీట్ కాకుండా చూసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీజే జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ ఖాసిం జమాతే ఇస్లామీ హింద్ బాధ్యులు మొహమ్మద్ ఇంతియాజ్, మహమ్మద్ యూసఫ్ షరీఫ్, సమీ, ఇలియాజ్, అబ్దుల్ రజాక్ పట్టణంలోని యువకులు విద్యావంతులు తదితరులు పాల్గొన్నారు

# వరి అవశేషాలు కాల్చొద్దు..

## రైతులకు ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి విజ్ఞప్తి



**హుజురాబాద్,మే 24(తెలంగాణ ముచ్చట్లు ):** ప్రస్తుతం మండుతున్న ఎండలు, పొడి వాతావరణ పరిస్థితుల కారణంగా పొలాల్లో వరి కోయ్యలు, గడ్డి అవశేషాలు కాల్చడం వల్ల భారీ అగ్ని ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల నియోజకవర్గ పరిధిలో పలు ప్రాంతాల్లో పంట అవశేషాలకు నిప్పంటించడంతో మంటలు వేగంగా వ్యాపించి సమీపంలోని తాటి చెట్లు, పంట తోటలు, వ్యవసాయ సామగ్రి, విద్యుత్ వైర్లు దగ్ధమైన ఘటనలు జరిగినట్లు తెలిపారు. రైతులు నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా అప్రమత్తంగా ఉండాలని, పంట అవశేషాలను కాల్చకుండా ప్రత్యామ్నాయ పద్ధతులు అనుసరించాలని సూచించారు. చిన్న పొరపాటు వల్ల పెద్ద నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ముఖ్యంగా ఎండ గాలులు ఎక్కువగా వీస్తున్న సమయంలో మంటలు అదుపు తప్పి సమీప గ్రామాల వరకు వ్యాపించే అవకాశముందని పేర్కొన్నారు.
అగ్ని ప్రమాదాల వల్ల రైతులకు ఆర్థిక నష్టం మాత్రమే కాకుండా పర్యావరణానికి కూడా తీవ్ర హాని కలుగుతుందని ఎమ్మెల్యే అన్నారు. వ్యవసాయ భూముల్లో మంటలు పెట్టే ముందు రైతులు ఒకసారి ఆలోచించాలని, గ్రామస్థులు కూడా అప్రమత్తంగా ఉండి అగ్ని ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. అధికారులు కూడా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి రైతులకు సూచనలు ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ప్రజల ఆరోగ్య రక్షణే ప్రభుత్వ లక్ష్యం : చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని






**హుజురాబాద్,మే 24(తెలంగాణ ముచ్చట్లు ):** హుజురాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి సమయానికి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.
ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆరోగ్యమే మహాభాగ్యమని, ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం సంతోషంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలు పరిశుభ్రత పాటించడం ద్వారా అనేక వ్యాధులను దూరం చేసుకోవచ్చని తెలిపారు.
అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు ఆరోగ్యంపై మరింత జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆరోగ్య శిబిరాలు, ఉచిత వైద్య పరీక్షలను ప్రజలు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, వైద్య సిబ్బంది, స్థానిక నాయకులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# జమ్మికుంట మండల ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక





**జమ్మికుంట టౌన్ మే 24 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట మండల ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం రాష్ట్ర నాయకుల సమక్షంలో ఓటింగ్ విధానంలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షునిగా మహమ్మద్ ముస్తఫా, ఉపాధ్యక్షునిగా ఎర్ర రాజు ఎన్నికయ్యారు. అలాగే సెక్రటరీగా దొడ్డే ఆంజనేయులు, కోశాధికారిగా సుంకరి రమేష్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు.
ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మహమ్మద్ ముస్తఫా, ఉపాధ్యక్షుడు ఎర్ర రాజు మాట్లాడుతూ జమ్మికుంట మండల ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్‌ను మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తామని తెలిపారు. ఫోటోగ్రాఫర్ల సంక్షేమంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో కూడా సంఘం ముందుండి పనిచేస్తుందని పేర్కొన్నారు. సభ్యుల ఐక్యతతో సంఘ అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తామని, ఫోటోగ్రాఫర్ల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉంటామని నూతన కమిటీ స్పష్టం చేసింది. ఈ సందర్భంగా సభ్యులు నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలియజేశారు.

# మడిపల్లి అగ్నిప్రమాద బాధిత గౌడ కుటుంబాలకు వెంటనే న్యాయం చేయాలి





ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

**జమ్మికుంట టౌన్ మే 24 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామంలో జరిగిన ఘోర అగ్నిప్రమాదంలో ఈతవనం, తాటివనం పూర్తిగా దగ్ధమై గౌడ కుటుంబాలు తీవ్ర ఆర్థిక నష్టాన్ని చవిచూశాయి. ఈ ఘటనపై హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సంఘటన స్థలాన్ని సందర్శించి బాధిత కుటుంబాలను పరామర్శించారు. అగ్నిప్రమాదంతో జీవనాధారం కోల్పోయిన గౌడ సోదరుల పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించిన ఎమ్మెల్యే, బాధితులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా జరిగిన నష్టంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేసిన ఆయన, ప్రభుత్వం మానవతా దృక్పథంతో స్పందించి బాధిత కుటుంబాలకు తక్షణ ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. బాధితులకు వెంటనే నష్టపరిహారం మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడిన ఎమ్మెల్యే, పరిస్థితిని వివరించారు. అలాగే ఎక్సైజ్ శాఖ అధికారులతో కూడా చర్చించి సంబంధిత శాఖల ద్వారా బాధిత కుటుంబాలకు అత్యవసర సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గౌడ కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలవాలని, బాధితులకు పూర్తి న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రస్తుతం గ్రామంలో విషాద ఛాయలు అలుముకోగా, స్థానికులు కూడా బాధిత కుటుంబాలకు తోడుగా నిలుస్తున్నారు.






# పరిశుద్ధాత్మ దిగివచ్చిన దినమే పెంతెకొస్తు పండుగ

**పెంతెకొస్తు పండుగ దినమున ధర్మశాస్త్రం ఆమోదించబడింది**
**అసెంబ్లీ ఆఫ్ యావె మినిస్ట్రీ పాస్టర్ పాలడుగు రత్నపాల్**

**ఖమ్మం బ్యూరో , మే 24 (తెలంగాణ ముచ్చట్లు )** : పరిశుద్ధాత్మ దిగివచ్చిన దినమే పెంతెకొస్తు పండుగ అని, పెంతెకొస్తు పండుగ దినమున ధర్మశాస్త్రం ఆమోదించబడిందని ఈ పండుగను పరిశుద్ధ గ్రంథం బైబిల్ నందు ప్రవక్తలు, యాషువ మెస్సీయ, అపోస్తులలు పాటించారని, విశ్వాసమున్న ప్రతిఒక్కరూ ఈ పండుగను ఆచరించాలని, ఇది 'ఆజ్ఞ' అని అసెంబ్లీ ఆఫ్ యావె మినిస్ట్రీ పాస్టర్ పాలడుగు రత్నపాల్ అన్నారు. ఖమ్మం నగరంలోని రమణగుట్ట యావె సమాజ ప్రార్థన మందిరంలో ఆదివారం పెంతెకొస్తు పండుగ (వారముల పండుగ)ను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాస్టర్ పాలడుగు రత్నపాల్ బైబిల్ గ్రంథాన్ని బోదిస్తూ.. పరిశుద్ధ గ్రంథమైన బైబిల్ ను ప్రామాణికంగా తీసుకొని విశ్రాంతిదినమును(సబ్బాత్), నెలపొడుపు దినము, పండుగలు ఎలోహిం (దేవుని) కట్టడులని, బైబిల్ ను నమ్మి విశ్వసించేవారందరూ తప్పకుండా ఆచరించాలని బోధించారు. బైబిల్ పండుగలలో పెంతెకొస్తు (ప్రథమ ఫలాల) పండుగ ప్రత్యేకమైనదన్నారు. ఈ పండుగ దినమున పరిశుద్ధాత్మ దిగివచ్చినదని, అలాగే ధర్మశాస్త్రము ఆమోదించబడిందని లేఖనాలు తెలియజేస్తున్నాయన్నారు. లేఖనాలైన లేవియాకాండం 23 : 11, 16, ద్వితియోపదేశకాండము 16 : 16, అపోస్తుల కార్యములు 2 : 1 లలో స్పష్టం చేస్తున్నాయన్నారు. తెలుగు భాషతో పాటు, ఇంగ్లీషు, హిబ్రూ, గ్రీకు తదితర బాషలలో బైబిల్ గ్రంథాన్ని ప్రామాణికంగా తీసుకొని అత్యంత భక్తిశ్రద్ధలతో నిష్ఠగా పఠనం చేస్తేనే దినాలు, విశ్రాంతిదినము(సబ్బాత్), పండుగలు, ధర్మశాస్త్రమును ఎలోహిం(దేవుడు) శాస్త్రీయంగా వాస్తవాన్ని బయలుపర్చుతాడని బోధించారు. ఈ పండుగ సందర్భంగా వాయిద్యాలతో యావె, యాషువ మెస్సీయ గీతాలను విశ్వాసులు, యువకులు, చిన్నారులు భక్తిశ్రద్ధలతో పాడి ఆనందింపజేశారు. అనంతరం పరమతండ్రి యావె అంటూ యాషువ మెస్సీయ పేరున ప్రార్థనలు జరిపారు. ఈ పండుగ పరిశుద్ధ బైబిల్ గ్రంథం అంతటిలో పాత నిబంధనలో 49 సార్లు, క్రొత్త నిబంధనలో 3 సార్లు మొత్తంగా 52 సార్లు వ్రాయబడిందన్నారు. పూర్తి వివరాలకు సెల్ నెం. 9989841107 సంప్రదించండి. ఈ కార్యక్రమంలో సువార్త సహకారులు మోదుగు మోషే, అంబోజి జీవరత్నం, వడ్లమూడి ప్రశాంత్, బి. పౌలు (రూఫ్లాల్), పాలడుగు జీవన్, సామేలు, కొరకొప్పుల డేవిడ్, గడ్డం ఏబేలు, మోదుగు దానియేలు, రోహిత్, ఐజెక్, రామ్ స్నేహిత్, ప్రిన్స్, పాలడుగు అనిత, పావని, స్వరూప, కళమ్మ, రూతు, సునీత, సుధ, ఎస్తేరు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
సోమవారం - 25 - మే 2026


# ఇంట్లోనే కేఫ్ కాఫీ



- **సరైన కొలతలతో రుచి మార్పు**
- **నిల్వ విధానమే కాఫీ నాణ్యతకు కీలకం**
- **ఖరీదైన మెషీన్లు అవసరం లేదంటున్న నిపుణులు**

ఉదయం లేవగానే ఒక కప్పు కాఫీ తాగడం చాలామందికి రోజువారీ అలవాటుగా మారిపోయింది. ఇంట్లో కాఫీ తయారు చేసినా, బయట కేఫ్‌లో తాగినా రుచిలో ఉండే తేడా గురించి చాలామంది చర్చిస్తుంటారు. ఇంట్లో తయారు చేసే కాఫీకి కేఫ్‌లో లభించే ప్రత్యేక రుచి ఎందుకు రాదనే సందేహం చాలా మందిలో ఉంటుంది. అయితే కాఫీ తయారీలో ఉపయోగించే సరైన కొలతలు, నిల్వ విధానం, తయారీ పద్ధతులే రుచిని పూర్తిగా మార్చేస్తాయని నిపుణులు చెబుతున్నారు. కేవలం కొన్ని చిన్న అలవాట్లు మార్చుకుంటే ఇంట్లోనే కేఫ్ స్థాయి కాఫీని సులభంగా తయారు చేసుకోవచ్చని సూచిస్తున్నారు. కాఫీ తయారీలో చాలామంది అంచనాలకే ఆధారపడుతుంటారు. ఎంత కాఫీ పొడి వేయాలి, ఎంత నీరు కలపాలి అనే విషయంలో ఖచ్చితమైన కొలతలు పాటించకపోవడం వల్ల రుచి మారిపోతుంది. కాఫీ పొడి ఎక్కువైతే చేదుగా మారడం, తక్కువైతే నీళ్ల రుచిలా అనిపించడం సాధారణమని నిపుణులు చెబుతున్నారు. అందుకే రూ.300 నుంచి రూ.500 మధ్యలో లభించే చిన్న కిచెన్ స్కేల్ ఉపయోగించడం మంచిదని సూచిస్తున్నారు. కాఫీ పొడి, నీటి నిష్పత్తిని కచ్చితంగా కొలిచి తయారు చేస్తే ప్రతిసారీ ఒకే రకమైన రుచి వస్తుందని వివరిస్తున్నారు. కొద్ది రోజుల పాటు ఈ విధానాన్ని పాటిస్తే తర్వాత సహజంగానే సరైన అంచనా వచ్చేస్తుందని చెబుతున్నారు. కేఫ్‌లలో కాఫీకి ఒకే రకమైన రుచి రావడానికి ప్రధాన కారణం ప్రతి దశలో చూపే శ్రద్ధేనని నిపుణులు పేర్కొంటున్నారు. అక్కడ బారిస్టాలు కాఫీ పరిమాణం, నీటి ఉష్ణోగ్రత, తయారీ సమయం వంటి అంశాలను జాగ్రత్తగా గమనిస్తూ ఉంటారు. ఇంట్లో కూడా కనీసం సాధారణ స్థాయిలో ఈ పద్ధతులను పాటిస్తే కేఫ్ కాఫీకి దగ్గరగా రుచి పొందవచ్చని చెబుతున్నారు. ముఖ్యంగా తాజా కాఫీ గింజలు ఉపయోగించడం, సరైన గ్రైండ్ ఎంచుకోవడం, తగిన ఉష్ణోగ్రతలో నీరు వాడడం వంటి అంశాలు రుచిపై ప్రభావం చూపుతాయని వివరిస్తున్నారు. కాఫీ నిల్వ చేసే విధానం కూడా రుచిలో కీలక పాత్ర పోషిస్తుందని నిపుణులు చెబుతున్నారు. గాలి, తేమ, వేడి, వెలుతురు కాఫీ నాణ్యతను దెబ్బతీసే ప్రధాన కారణాలుగా భావిస్తారు. కాఫీ ప్యాకెట్ ఓపెన్ చేసిన తర్వాత గాలి చొరబడని డబ్బాలో నిల్వ చేయడం మంచిదని సూచిస్తున్నారు. స్టవ్ దగ్గర లేదా నేరుగా ఎండ తగిలే ప్రదేశాల్లో కాఫీ ఉంచకూడదని హెచ్చరిస్తున్నారు. అలాగే ఫ్రిజ్ లేదా ఫ్రీజర్‌లో నిల్వ చేయడం వల్ల ఉష్ణోగ్రత మార్పుల కారణంగా తేమ ఏర్పడి కాఫీ గింజల నాణ్యత తగ్గే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. సెరామిక్ లేదా స్టీల్ ఎయిర్‌టైట్ డబ్బాలు కాఫీ తాజాదనాన్ని ఎక్కువకాలం నిల్వ ఉంచడంలో సహాయపడతాయని సూచిస్తున్నారు. మంచి కాఫీ కోసం ఖరీదైన మెషీన్లు తప్పనిసరి కాదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. గత కొన్నేళ్లలో దేశంలో కాఫీ మార్కెట్ విస్తరించడంతో మంచి నాణ్యత గల కాఫీ గింజలు, పరికరాలు సులభంగా అందుబాటులోకి వచ్చాయని చెబుతున్నారు. సరైన అలవాట్లు, కొలతల్లో స్థిరత్వం, శుభ్రమైన నిల్వ విధానం పాటిస్తే ఇంట్లోనే అద్భుతమైన కాఫీ తయారు చేయవచ్చని వివరిస్తున్నారు. కేఫ్ అనుభవానికి అసలు కారణం ఖరీదైన పరికరాలు కాకుండా ప్రతి దశలో చూపే శ్రద్ధేనని నిపుణులు చెబుతున్నారు.

# ఎండు చేపల పవర్

- **పురుషుల ఆరోగ్యానికి ప్రత్యేక మేలు**
- **కండరాల బలం నుంచి గుండె రక్షణ వరకు ప్రయోజనాలు**
- **ఉప్పు ఎక్కువైతే జాగ్రత్తలు తప్పనిసరి**

ఆహార ప్రియుల్లో చాలామందికి తాజా చేపల కంటే ఎండు చేపలతో చేసిన వంటకాలంటేనే ప్రత్యేకమైన ఇష్టం ఉంటుంది. ఎండు చేపల పులుసు, వేపుడు వంటి వంటకాలు ఊహించుకుంటేనే చాలామందికి నోరూరిపోతుంది. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు ఎండు చేపలకు ప్రత్యేకమైన అభిమానులు ఉన్నారు. అయితే ఇవి కేవలం రుచికోసమే కాదు, ఆరోగ్య పరంగానూ ఎన్నో ప్రయోజనాలు అందిస్తాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా పురుషుల శారీరక దారుఢ్యానికి, హార్మోన్ల సమతుల్యతకు ఎండు చేపలు ఎంతో ఉపయోగపడతాయని వైద్య నిపుణులు వివరిస్తున్నారు. చేపలను ఎండబెట్టే ప్రక్రియలో వాటిలోని నీటి శాతం తగ్గిపోవడంతో పోషకాలు మరింత కేంద్రీకృతమవుతాయి. అందుకే ఎండు చేపలలో ప్రోటీన్ల మోతాదు అధికంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. పురుషులకు కండరాల బలం, శారీరక శ్రమ, రోజువారీ పనుల్లో చురుకుదనం కోసం ప్రోటీన్లు చాలా అవసరం. ఎండు చేపలలో ఉండే లీన్ ప్రోటీన్లు కండరాల నిర్మాణానికి, కణాల మరమ్మత్తుకు సహాయపడతాయి. ముఖ్యంగా వ్యాయామం చేసే వారు, జిమ్‌కు వెళ్లే వారు తమ ఆహారంలో పరిమిత మోతాదులో ఎండు చేపలను చేర్చుకుంటే శరీరానికి శక్తి పెరుగుతుందని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. ఎండు చేపలలో ఓమెగా-3 కొవ్వు ఆమ్లాలు కూడా సమృద్ధిగా ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యాన్ని కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయి. శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి మంచి కొలెస్ట్రాల్‌ను పెంచడంలో ఇవి సహాయపడతాయి. దీంతో రక్తపోటు నియంత్రణలో ఉండటంతో పాటు గుండె సంబంధిత వ్యాధుల ముప్పు తగ్గే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. ఆధునిక జీవనశైలిలో గుండె సంబంధిత సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో పోషకాలు అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవడం ఎంతో అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. వయసు పెరిగేకొద్దీ పురుషుల్లో కూడా ఎముకల బలహీనత సమస్యలు కనిపించే అవకాశముంది. ఎండు చేపలను చాలాసార్లు చిన్న ముళ్లతో సహా నమిలి తింటారు. దీని వల్ల శరీరానికి అవసరమైన క్యాల్షియం, ఫాస్ఫరస్, విటమిన్ డి లభిస్తాయి. ఇవి ఎముకలు, దంతాలను బలంగా ఉంచడంలో సహాయపడతాయి. అలాగే ఎండు చేపలలో ఉండే జింక్, సెలెనియం వంటి ఖనిజాలు పురుషులలో టెస్టోస్టెరాన్ హార్మోన్ ఉత్పత్తికి తోడ్పడతాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఇవి రోగనిరోధక శక్తిని పెంచడంతో పాటు అలసట, నీరసాన్ని తగ్గించడంలో కూడా ఉపయోగపడతాయని వివరిస్తున్నారు. అయితే ఎండు చేపలు తినేటప్పుడు కొన్ని జాగ్రత్తలు పాటించడం కూడా చాలా అవసరం. మార్కెట్లో లభించే కొన్ని ఎండు చేపలలో నిల్వ ఎక్కువ రోజులు ఉండేందుకు అధికంగా ఉప్పు కలుపుతుంటారు. దీంతో రక్తపోటు, కిడ్నీ సమస్యలు ఉన్నవారికి ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉంటుంది. అందుకే నాణ్యమైన ఎండు చేపలను మాత్రమే కొనుగోలు చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. వండే ముందు వేడి నీటిలో బాగా కడిగి శుభ్రం చేయడం మంచిదని చెబుతున్నారు. పరిమిత మోతాదులో తీసుకుంటేనే ఎండు చేపల వల్ల ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చని, అధికంగా తినడం మంచిది కాదని వైద్యులు హెచ్చరిస్తున్నారు.



## బుమ్రాకు క్షమాపణ చెప్పిన చరణ్




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా తెరకెక్కుతున్న 'పెద్ది' సినిమా మ్యూజిక్ లాంచ్ కార్యక్రమం భోపాల్‌లో ఘనంగా జరిగింది. ఈ వేడుకలో రామ్ చరణ్ చేసిన చిన్న పొరపాటు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ర్యాపిడ్ ఫైర్ సెషన్‌లో క్రికెటర్ల గురించి ఒక్క మాటలో చెప్పాలని హోస్ట్ అడగగా, చరణ్ టీమిండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా పేరు ప్రస్తావిస్తూ తాను ఆయనకు పెద్ద అభిమానినని చెప్పారు. అయితే వెంటనే బుమ్రాను ఫుట్‌బాల్ ప్లేయర్‌గా పొరపాటుగా పేర్కొనడంతో సోషల్ మీడియాలో ట్రోల్స్, మీమ్స్ వెల్లువెత్తాయి.

ఈ ఘటనపై స్పందించిన రామ్ చరణ్ బుమ్రాకు క్షమాపణలు తెలిపారు. "కొన్నిసార్లు పేర్లు మర్చిపోతుంటాను. అభిమానుల సందడి, పెద్ద జనసమూహం మధ్య అనుకోకుండా ఆ పొరపాటు జరిగింది. బుమ్రాపై నాకు ఎంతో గౌరవం ఉంది. ఆయన ఆటకు నేను పెద్ద అభిమానిని. తన అద్భుత ప్రదర్శనలతో ప్రతి భారతీయుడు గర్వపడేలా చేస్తున్నారు" అని చరణ్ పేర్కొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : పొట్లపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# వచ్చే వారం నాలుగు రోజులే ట్రేడింగ్

భారతీయ స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టే ఇన్వెస్టర్లు, రోజువారీ ట్రేడింగ్ చేసే వ్యాపారులు వచ్చే వారం ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మే 25 నుంచి మే 31 మధ్య స్టాక్ మార్కెట్లు కేవలం నాలుగు రోజులు మాత్రమే పనిచేయనున్నాయి. మే 28వ తేదీన బక్రీద్ పండుగ సందర్భంగా దేశంలోని ప్రధాన స్టాక్ మార్కెట్ సంస్థలు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్, బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ అధికారిక సెలవు ప్రకటించాయి.




ఇప్పటికే ప్రతి వారం శని, ఆదివారాల్లో మార్కెట్లు మూసివేస్తుండటంతో మే 30, 31 తేదీల్లో కూడా ట్రేడింగ్ జరగదు. దీంతో వరుసగా మూడు రోజుల పాటు మార్కెట్ కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోనున్నాయి. ఈ కారణంగా ట్రేడర్లు, డెరివేటివ్ వ్యాపారులు, స్వల్పకాలిక పెట్టుబడిదారులు తమ వ్యూహాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని మార్కెట్ నిపుణులు సూచిస్తున్నారు.

ఈ మూడు రోజుల విరామం ప్రభావం ఈక్విటీ మార్కెట్లకే పరిమితం కాదు. డెరివేటివ్స్, కరెన్సీ ట్రేడింగ్, కమోడిటీ సెగ్మెంట్లలో కూడా ఎలాంటి లావాదేవీలు జరగవు. సాధారణంగా గురువారాల్లో ముగిసే వీక్లీ డెరివేటివ్ కాంట్రాక్టుల గడువు ఈసారి సెలవు కారణంగా ఒక రోజు ముందుకు జరగనుంది. దీంతో మే 28కు బదులుగా మే 27వ తేదీ బుధవారం నాడే వారాంతపు ఎక్స్‌పైరీ పూర్తయ్యే అవకాశముందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

దీంతో ఆప్షన్స్ ట్రేడింగ్, ఫ్యూచర్స్ ఒప్పందాల్లో ఒడిదుడుకులు పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా తక్కువ ట్రేడింగ్ రోజుల కారణంగా మార్కెట్‌లో అస్థిరత పెరగవచ్చని హెచ్చరిస్తున్నారు. విదేశీ పెట్టుబడులు, అంతర్జాతీయ మార్కెట్ల ప్రభావం, అంతర్జాతీయ రాజకీయ పరిణామాలు కూడా దేశీయ మార్కెట్‌పై ప్రభావం చూపే అవకాశం ఉందని చెబుతున్నారు.

# జియో ఐపీవోకు మళ్లీ బ్రేక్

దేశీయ స్టాక్ మార్కెట్ చరిత్రలోనే అతిపెద్ద ఐపీవోలలో ఒకటిగా భావిస్తున్న రిలయన్స్ ఇండస్ట్రీస్కు చెందిన జియో ఐపీవో మరోసారి వాయిదా పడినట్లు సమాచారం. గత కొన్ని నెలలుగా వాయిదాలు ఎదుర్కొంటున్న ఈ ప్రక్రియపై సంస్థ ఇంకా తుది నిర్ణయం తీసుకోలేకపోతున్నట్టు తెలుస్తోంది.

పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులు, అంతర్జాతీయ స్థాయిలో నెలకొన్న భౌగోళిక రాజకీయ అనిశ్చితి, ప్రపంచ మార్కెట్ల అస్థిరత వంటి అంశాలు ఈ నిర్ణయంపై ప్రభావం చూపుతున్నాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. దేశీయ స్టాక్ మార్కెట్లలో కొనసాగుతున్న ఒడిదుడుకులు, విదేశీ మూలధన ప్రవాహాల తగ్గుదల కారణంగా ఐపీవో విడుదలకు ఇది సరైన సమయం కాదనే అభిప్రాయం సంస్థలో వ్యక్తమవుతున్నట్టు సమాచారం.

ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ సంస్థ ఈ ఐపీవో ద్వారా భారీ స్థాయిలో పెట్టుబడులు సమీకరించాలని భావించినప్పటికీ, ప్రస్తుత పరిస్థితులు పెట్టుబడిదారుల స్పందనపై ప్రభావం చూపే అవకాశం ఉందని అంచనా వేస్తోంది. మార్కెట్ పరిస్థితులు అనుకూలంగా మారే వరకు వేచి చూడాలనే ఆలోచనలో సంస్థ ఉన్నట్టు తెలుస్తోంది.

అయితే ఐపీవో ప్రక్రియను పూర్తిగా నిలిపివేయలేదని, త్వరలోనే భారతీయ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డుకు దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని పరిశీలిస్తున్నట్టు కంపెనీ వర్గాలు సంకేతాలు ఇచ్చాయి.

# బీవోఐ డిపాజిట్లపై వడ్డీ పెంపు

ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ సంస్థ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్థిర డిపాజిట్లపై వడ్డీ రేట్లను సవరించింది. రూ.3 కోట్ల లోపు డిపాజిట్లకు సంబంధించిన కొన్ని కాలపరిమితులపై వడ్డీ రేట్లు పెంచినట్లు బ్యాంకు వెల్లడించింది. తాజా నిర్ణయం ప్రకారం ఏడాది నుంచి రెండేళ్ల లోపు కాలపరిమితి గల డిపాజిట్లపై వడ్డీ రేటును 6.50 శాతానికి పెంచింది. రెండేళ్ల నుంచి మూడేళ్ల లోపు డిపాజిట్లపై వడ్డీని 6.60 శాతంగా నిర్ణయించింది. అలాగే మూడేళ్లలోపు మరికొన్ని డిపాజిట్ పథకాలపై వడ్డీ రేటును 6.70 శాతానికి సవరించింది. సీనియర్ సిటిజన్లకు అదనంగా 0.50 శాతం నుంచి 0.65 శాతం వరకు ప్రత్యేక వడ్డీ ప్రయోజనం కల్పించనున్నట్లు బ్యాంకు ప్రకటించింది. తాజా మార్పులతో స్థిర డిపాజిట్లపై పెట్టుబడి పెట్టే ఖాతాదారులకు మరింత లాభం చేకూరనుంది.




# తొలి ట్రిలియనీర్‌గా మస్క్?




ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడిగా కొనసాగుతున్న ప్రముఖ వ్యాపారవేత్త ఎలాన్ మస్క్ త్వరలోనే ప్రపంచ చరిత్రలో తొలి ట్రిలియనీర్‌గా అవతరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అంతరిక్ష పరిశోధనల రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన ఆయన సంస్థ స్పేస్‌ఎక్స్ భారీ స్థాయిలో ప్రజా వాటాల విక్రయానికి సిద్ధమవుతుండటంతో మస్క్ ఆస్తుల విలువ అమాంతం పెరగనుందని అంతర్జాతీయ ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారుల దృష్టి మొత్తం స్పేస్‌ఎక్స్‌పైనే కేంద్రీకృతమైంది. ఇప్పటికే ఎలక్ట్రిక్ వాహనాల తయారీ సంస్థ టెస్లా ద్వారా ప్రపంచ వ్యాపార రంగాన్ని ప్రభావితం చేస్తున్న మస్క్.. అంతరిక్ష రంగంలోనూ స్పేస్‌ఎక్స్‌తో అద్భుత విజయాలు సాధిస్తున్నారు. ఉపగ్రహ ప్రయోగాలు, పునర్వినియోగ రాకెట్లు, అంతరిక్ష ప్రయాణాలు, ప్రపంచ వ్యాప్తంగా ఇంటర్నెట్ సేవల విస్తరణ వంటి రంగాల్లో ఈ సంస్థ అసాధారణ వేగంతో ఎదుగుతోంది. ముఖ్యంగా స్టార్‌లింక్ సేవలకు పెరుగుతున్న డిమాండ్ స్పేస్‌ఎక్స్ విలువను మరింత పెంచుతోందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

ఆర్థిక విశ్లేషకుల అంచనాల ప్రకారం స్పేస్‌ఎక్స్ మార్కెట్ విలువ సుమారు 1.75 లక్షల కోట్ల డాలర్ల వరకు చేరుకునే అవకాశం ఉంది. ఒకవేళ ప్రజా వాటాల విక్రయం సమయంలో సంస్థ విలువ 2 లక్షల కోట్ల డాలర్లను తాకితే.. మస్క్ వ్యక్తిగత సంపద 1 ట్రిలియన్ డాలర్లను దాటే అవకాశముందని చెబుతున్నారు. భారత కరెన్సీలో ఇది సుమారు రూ.96 లక్షల కోట్లకు పైగానే ఉంటుంది. ప్రస్తుతం టెస్లా, స్పేస్‌ఎక్స్, కృత్రిమ మేధస్సు సంస్థలు, సాంకేతిక రంగంలోని ఇతర పెట్టుబడులతో మస్క్ సంపద ఇప్పటికే ప్రపంచంలోనే అత్యధిక స్థాయిలో ఉంది.

అంతరిక్ష రంగాన్ని పూర్తిగా మార్చేయాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్న మస్క్.. భవిష్యత్తులో చంద్రుడు, మంగళ గ్రహ మిషన్లపై భారీ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. మానవాళిని ఇతర గ్రహాలపై స్థిరపరచాలన్న లక్ష్యంతో పనిచేస్తున్న ఆయన ప్రయత్నాలు ప్రపంచవ్యాప్తంగా ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ఇదే సమయంలో స్పేస్‌ఎక్స్ ప్రజా వాటాల విక్రయం విజయవంతమైతే కంపెనీ విలువ మరింత పెరిగే అవకాశముందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ఈ భారీ ఆర్థిక విస్తరణ వల్ల మస్క్ మాత్రమే కాదు.. స్పేస్‌ఎక్స్‌లో పనిచేస్తున్న పలువురు కీలక అధికారులు కూడా బిలియనీర్ల జాబితాలో చేరనున్నట్లు సమాచారం. సంస్థ అధ్యక్షురాలు 1 గ్విన్ షాట్‌వెల్, ప్రధాన ఆర్థిక అధికారి బ్రెట్ జాన్సన్, బోర్డు సభ్యుడు ల్యూక్ నాసెక్ తదితరుల సంపద కూడా భారీగా పెరగనుంది.

ప్రపంచ ఆర్థిక చరిత్రలో ఇప్పటివరకు ఎవరూ చేరుకోని స్థాయికి మస్క్ చేరుకునే అవకాశముండటంతో వ్యాపార, సాంకేతిక రంగాల్లో ఈ అంశం హాట్ టాపిక్‌గా మారింది. ఒక సాధారణ సాంకేతిక వ్యాపారవేత్తగా ప్రారంభమైన ఎలాన్ మస్క్ ప్రయాణం ఇప్పుడు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేసే స్థాయికి చేరుకోవడం విశేషంగా మారింది.

# చైనాలో విస్కీ క్రేజ్

ప్రస్తుతం చైనాలో మద్యం వినియోగపు అలవాట్లు వేగంగా మారుతున్నాయి. ఒకప్పుడు సంప్రదాయ మద్యం “బైజియు”కే పరిమితమైన యువత ఇప్పుడు పాశ్చాత్య పానీయాలవైపు ఆకర్షితమవుతోంది. ముఖ్యంగా నగర ప్రాంతాల్లో నివసించే యువత, ఐటీ ఉద్యోగులు, కార్పొరేట్ వర్గాలు, ఉన్నత విద్యావంతులు విస్కీని ఆధునిక జీవనశైలికి ప్రతీకగా భావిస్తూ ఎక్కువగా వినియోగిస్తున్నారు. దీంతో చైనాలో విస్కీ మార్కెట్ గత కొన్నేళ్లుగా ఊహించని స్థాయిలో విస్తరిస్తోంది. మారుతున్న జీవనశైలి, సామాజిక మాధ్యమాల ప్రభావం, విదేశీ సంస్కృతులపై పెరుగుతున్న ఆసక్తి కారణంగా చైనా యువతలో విస్కీకి డిమాండ్ భారీగా పెరిగిందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. గత నాలుగేళ్లలోనే చైనా విస్కీ మార్కెట్ విలువ సుమారు 2.3 బిలియన్ డాలర్లకు చేరుకోవడం ఈ మార్పుకు నిదర్శనంగా భావిస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళ వినోద కేంద్రాలు, లగ్జరీ రెస్టారెంట్లు, ప్రీమియం బార్లు, క్లబ్‌లలో విస్కీ వినియోగం విపరీతంగా పెరిగినట్లు తెలుస్తోంది.

ఇప్పటివరకు చైనాలో “బైజియు” అనే సంప్రదాయ మద్యం పానీయానికి అపారమైన ఆదరణ ఉండేది. కుటుంబ వేడుకలు, వ్యాపార సమావేశాలు, పండుగలు, వివాహ కార్యక్రమాల్లో బైజియు తప్పనిసరిగా ఉండేది. అయితే ప్రస్తుతం యువతలో కొత్త ఆలోచనలు పెరగడంతో విస్కీని స్టైలిష్ పానీయంగా భావించే ధోరణి కనిపిస్తోంది. కొందరు యువత విస్కీ సేవించడం తమ సామాజిక స్థాయికి గుర్తుగా భావిస్తున్నారని విశ్లేషకులు చెబుతున్నారు. అయినప్పటికీ బైజియు ప్రాధాన్యత పూర్తిగా తగ్గిపోలేదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఈ పానీయం చైనా సంస్కృతి, సంప్రదాయాల్లో బలంగా ముడిపడి ఉండటంతో దానికి ఇప్పటికీ భారీ మార్కెట్ కొనసాగుతోంది. గ్రామీణ ప్రాంతాలు, సంప్రదాయ కుటుంబాలు, వృద్ధుల్లో ఇప్పటికీ బైజియుకే ఎక్కువ ఆదరణ ఉందని తెలుస్తోంది. అందువల్ల విస్కీ ప్రభావం పెరుగుతున్నా బైజియు మార్కెట్ ఒక్కసారిగా క్షీణించే పరిస్థితి లేదని చెబుతున్నారు. ఇక చైనా మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకుని పలు అంతర్జాతీయ మద్యం సంస్థలు భారీ పెట్టుబడులు పెట్టడం ప్రారంభించాయి. ముఖ్యంగా ఫ్రాన్స్, బ్రిటన్ దేశాలకు చెందిన ప్రముఖ కంపెనీలు చైనాలోనే విస్కీ తయారీ యూనిట్లు ఏర్పాటు చేయడానికి ఆసక్తి చూపుతున్నాయి. చైనా యువత కొత్త రుచులను ఆస్వాదించేందుకు ఆసక్తి చూపుతుండటంతో అంతర్జాతీయ బ్రాండ్లు కూడా తమ ఉత్పత్తులను స్థానిక అభిరుచులకు అనుగుణంగా మార్చుకుంటున్నాయి. మరోవైపు బైజియు తయారీ సంస్థలు కూడా యువతను ఆకట్టుకునేందుకు కొత్త వ్యూహాలతో ముందుకొస్తున్నాయి. ఆధునిక ప్యాకేజింగ్, తక్కువ మత్తు శాతం, కొత్త ఫ్లేవర్లు, ఆకర్షణీయమైన ప్రకటనల ద్వారా యువతను తమవైపు తిప్పుకునే ప్రయత్నాలు చేస్తున్నాయి. ప్రస్తుతం చైనా మద్యం మార్కెట్లో సంప్రదాయం, ఆధునికత మధ్య ఆసక్తికర పోటీ కొనసాగుతోందని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.



# కాంగ్రెస్‌పై ఉదయనిధి ఫైర్

- **వెన్నుపోటు పొడిచిన పార్టీని నమ్మొద్దు**
- **విజయ్ ప్రభుత్వానికి మద్దతుపై డీఎంకే ఆగ్రహం**

సీఎం విజయ్ మైనారిటీ ప్రభుత్వానికి కాంగ్రెస్ పార్టీ మద్దతు ఇవ్వడంపై తమిళనాడు రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. డీఎంకే యువజన విభాగం కార్యదర్శి ఉదయనిధి స్టాలిన్ కాంగ్రెస్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. అధికార ఆశతో డీఎంకేను నమ్మించి వెన్నుపోటు పొడిచిందంటూ కాంగ్రెస్ నాయకత్వంపై మండిపడ్డారు. డీఎంకే కార్యకర్తలు ఇకపై కాంగ్రెస్‌ను నమ్మొద్దని, వారిని దరిదాపుల్లోకి కూడా రానివ్వొద్దని పిలుపునిచ్చారు. డీఎంకే కార్యకర్తల మద్దతు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నాయకత్వం వల్లే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గెలిచారని ఉదయనిధి అన్నారు. ప్రజలు స్టాలిన్ మళ్లీ ముఖ్యమంత్రిగా కొనసాగాలని కోరుకున్నందుకే కాంగ్రెస్ అభ్యర్థులకు ఓట్లు వచ్చాయని తెలిపారు. కానీ ఇప్పుడు కొన్ని పదవుల కోసం తమకు సమాచారం ఇవ్వకుండా కాంగ్రెస్ నాయకులు వెళ్లిపోవడం రాజకీయ ద్రోహమని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తమిళనాడు ప్రజలు కాంగ్రెస్ తీరును గమనిస్తున్నారని, అతి త్వరలోనే తగిన గుణపాఠం చెబుతారని ఉదయనిధి పేర్కొన్నారు. ఐదుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గెలవడానికి డీఎంకే కార్యకర్తల కృషే కారణమని గుర్తుచేశారు. రాజకీయాల్లో కృతజ్ఞత, మర్యాద ఉండాలని, కానీ కాంగ్రెస్ నాయకుల్లో అవి కనిపించడం లేదని విమర్శించారు. దేశవ్యాప్తంగా భారతీయ జనతా పార్టీ ఎదుగుదలకు కూడా కాంగ్రెస్ విధానాలే కారణమని ఉదయనిధి ఆరోపించారు. ఇప్పటివరకు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా వల్లే కాంగ్రెస్ ఓడిపోతుందని భావించామని, కానీ ఇప్పుడు చూస్తుంటే కాంగ్రెస్ మోసపూరిత రాజకీయాలే ప్రజలను దూరం చేస్తున్నాయని అన్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచిన స్థానాలు కూడా స్టాలిన్ నాయకత్వం వల్లే సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. జెన్ జెడ్ యువత రాజకీయాలపై స్పష్టమైన అవగాహన పెంచుకోవాలని ఉదయనిధి సూచించారు. తొలిసారి ఓటు వేసే యువతకు రాజకీయ చైతన్యం కల్పించడం చాలా అవసరమన్నారు. డీఎంకే యువజన విభాగం నేతలు గ్రామ స్థాయిలో యువతతో కలిసి పనిచేయాలని, ప్రజలకు నిజమైన రాజకీయ పరిస్థితులను వివరించాలని పిలుపునిచ్చారు.



# పింఛన్ కోసం అత్తను వీపుపై మోసిన కోడలు

- **9 కిలోమీటర్లు అడవులు దాటి బ్యాంకుకు ప్రయాణం**
- **వైరల్ వీడియోతో ప్రభుత్వ వ్యవస్థలపై విమర్శలు**

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని మారుమూల గిరిజన ప్రాంతంలో చోటుచేసుకున్న ఓ ఘటన ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరుపై తీవ్ర చర్చకు దారితీసింది. 90 ఏళ్ల వృద్ధురాలిని ఆమె కోడలు తన వీపుపై మోసుకుంటూ అడవులు, రాతిబాటలు, వాగులు దాటుకుంటూ కిలోమీటర్ల దూరం నడిచిన దృశ్యాలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఈ ఘటన ప్రజలను భావోద్వేగానికి గురి చేయడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలను మరోసారి బయటపెట్టింది. సర్గుజా జిల్లా పరిధిలోని మైన్‌పాట్ ప్రాంతానికి చెందిన సుఖ్మానియా బాయి అనే మహిళ తన 90 ఏళ్ల అత్తకు పింఛన్ డబ్బులు ఇప్పించేందుకు ఆమెను వీపుపై మోస్తూ దాదాపు 9 కిలోమీటర్ల దూరంలోని బ్యాంకుకు తీసుకెళ్లింది. ఆ ప్రాంతంలో సరైన రవాణా సౌకర్యాలు లేకపోవడంతో ప్రజలు ఇప్పటికీ కాలినడకనే ప్రమాదకర మార్గాల్లో ప్రయాణించాల్సి వస్తోందని స్థానికులు చెబుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం



పింఛన్ డబ్బులు పొందాలంటే లబ్ధిదారులు స్వయంగా బ్యాంకుకు వెళ్లి వేలిముద్రలు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ కారణంగానే గత కొన్ని నెలలుగా సుఖ్మానియా బాయి తన అత్తను ఇలాగే మోసుకుంటూ బ్యాంకుకు తీసుకెళ్తున్నట్లు సమాచారం. మండుటెండలో అడవులు, వాగులు దాటుకుంటూ ఆమె పడుతున్న శ్రమ స్థానికులను కలచివేసింది. వీడియో చిత్రీకరిస్తున్న వ్యక్తి.. "ఇంత కష్టపడి ఎందుకు మోసుకెళ్తున్నావు?" అని అడగగా సుఖ్మానియా బాయి తన ఆవేదనను వ్యక్తం చేసింది. "బ్యాంకుకు స్వయంగా తీసుకెళ్తేనే పింఛన్ డబ్బులు ఇస్తున్నారు. మా ఊరికి బస్సు సౌకర్యం లేదు. ప్రతి నెల రూ.1500 కోసం ఈ కష్టం పడాల్సి వస్తోంది" అని ఆమె తెలిపింది. గతంలో పింఛన్ డబ్బులు గ్రామంలోనే అందేవని, ఇప్పుడు మాత్రం బ్యాంకుకు వెళ్లక తప్పడం లేదని పేర్కొంది. ఈ వీడియో వైరల్ కావడంతో నెటిజన్లు ప్రభుత్వ వ్యవస్థలపై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. డిజిటల్ ఇండియా, ఇంటివద్దకే సేవలు అంటూ ప్రచారం చేస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు పూర్తిగా భిన్నంగా ఉన్నాయని అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా మారుమూల గిరిజన ప్రాంతాల్లో కనీస సంక్షేమ పథకాల లబ్ధి పొందడమే ప్రజలకు భారంగా మారిందని వ్యాఖ్యానిస్తున్నారు. ఈ ఘటన గ్రామీణ భారతదేశంలో ఇప్పటికీ కొనసాగుతున్న రవాణా సమస్యలు, డిజిటల్ సేవల లోపాలు, పేదల ఇబ్బందులను స్పష్టంగా చూపిస్తోందని సామాజిక కార్యకర్తలు అంటున్నారు. వృద్ధులు, వికలాంగులు, గిరిజన ప్రాంతాల ప్రజలకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

# ఆఫ్రికాలో ఎబోలా విజృంభణ



- **భారతీయులకు కేంద్రం హెచ్చరిక**
- **అత్యవసరం అయితే తప్ప ప్రయాణాలు వద్దన్న సూచన**

ఎబోలా వైరస్ ఆఫ్రికా దేశాల్లో భారీగా వ్యాపిస్తుండటంతో భారత ప్రభుత్వం అప్రమత్తమైంది. ముఖ్యంగా డెమోక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఉగాండా, దక్షిణ సూడాన్ దేశాలకు అత్యవసర పరిస్థితులు తప్ప ప్రయాణాలు చేయొద్దని భారతీయులకు సూచించింది. ఆ దేశాల్లో ఎబోలా వైరస్ వేగంగా వ్యాపిస్తుండటంతో ఆరోగ్య శాఖ అప్రమత్త చర్యలు చేపట్టింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా ఎబోలా వ్యాప్తిపై కీలక ప్రకటన చేసింది. ఆఫ్రికాలో పరిస్థితులు ఆందోళనకరంగా మారుతున్నాయని పేర్కొంటూ "పబ్లిక్ హెల్త్ ఎమర్జెన్సీ ఆఫ్ ఇంటర్నేషనల్ కన్సర్న్"గా ప్రకటించింది. అంతర్జాతీయ స్థాయిలో అప్రమత్తత అవసరమని స్పష్టం చేసింది. అలాగే ఆఫ్రికా సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ కూడా ఎబోలా వ్యాప్తిపై అత్యవసర పరిస్థితిని ప్రకటించింది. ప్రస్తుతం కాంగో, ఉగాండా ప్రాంతాల్లో బుండిబుగ్యో రకం ఎబోలా వైరస్ ఎక్కువగా వ్యాపిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ వైరస్ చాలా వేగంగా ఒకరి నుంచి మరొకరికి సోకుతుంది. రక్తం, వాంతులు, చెమట, వీర్యం, ఇతర శరీర ద్రవాల ద్వారా ఈ వైరస్ వ్యాపిస్తుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. జ్వరం, తీవ్రమైన బలహీనత, కండరాల నొప్పులు, డయేరియా, కొన్ని సందర్భాల్లో రక్తస్రావం వంటి లక్షణాలు కనిపించే అవకాశముందని తెలిపారు. ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని ఆరోగ్య శాఖ సూచిస్తోంది. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, అనారోగ్యంతో ఉన్నవారికి దూరంగా ఉండాలని సూచిస్తున్నారు. విదేశీ ప్రయాణాలు చేసే వారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరిస్తున్నారు. ఇక భారతదేశంలో కూడా కేంద్ర ప్రభుత్వం అప్రమత్త చర్యలు ప్రారంభించింది. విదేశాల నుంచి వచ్చే ప్రయాణికులను నిశితంగా పరిశీలిస్తున్నారు. ముఖ్యంగా ఆఫ్రికా దేశాల నుంచి వచ్చే పర్యాటకులపై ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగుతోంది. అంతర్జాతీయ విమానాశ్రయాల్లో ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తూ, అనుమానిత లక్షణాలు ఉన్నవారిని ప్రత్యేకంగా పరిశీలిస్తున్నారు. ఎబోలా విజృంభణ నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య సంస్థలు అప్రమత్తమవుతున్నాయి. వైరస్ మరింత వ్యాపించకుండా నియంత్రణ చర్యలు చేపడుతూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాయి. పరిస్థితిని నిరంతరం గమనిస్తున్నామని, అవసరమైన చర్యలు తీసుకుంటామని భారత ఆరోగ్య శాఖ వెల్లడించింది.

# తమిళనాడులో ఉచిత విద్యుత్ విస్తరణ



- **కోటికి పైగా కుటుంబాలకు సున్నా బిల్లు**
- **కొత్త విధానం వచ్చే బిల్లింగ్ సైకిల్ నుంచి అమలు**

తమిళనాడు రాష్ట్రంలోని గృహ విద్యుత్ వినియోగదారులకు ప్రభుత్వం భారీ ఊరటనిచ్చింది. ఉచిత విద్యుత్ పథకాన్ని మరింత విస్తరిస్తూ ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం వచ్చే బిల్లింగ్ సైకిల్ నుంచి అమల్లోకి రానుంది. ఈ కొత్త విధానం వల్ల రాష్ట్రంలోని కోటికి పైగా కుటుంబాలకు విద్యుత్ బిల్లు పూర్తిగా సున్నాగా మారే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ముఖ్యమంత్రిగా సి. జోసెఫ్ విజయ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత తీసుకున్న తొలి కీలక సంక్షేమ నిర్ణయంగా దీనిని భావిస్తున్నారు. సామాన్య, మధ్యతరగతి కుటుంబాలపై పెరుగుతున్న ఖర్చుల భారాన్ని తగ్గించడమే ఈ పథకం లక్ష్యమని ప్రభుత్వం పేర్కొంది. ఈ నిర్ణయంతో లక్షలాది కుటుంబాలకు ప్రతి రెండు నెలలకు గణనీయమైన ఆదా కలగనుందని అధికారులు చెబుతున్నారు. ఈ పథకం అమలు కోసం తమిళనాడు పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ తమ బిల్లింగ్ సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేస్తోంది. అర్హుల గుర్తింపు, సబ్సిడీ లెక్కింపు, బిల్లుల జారీ వంటి అంశాల్లో మార్పులు చేస్తున్నట్లు సంస్థ అకౌంట్స్ విభాగం వెల్లడించింది. క్షేత్రస్థాయి సిబ్బందికి పూర్తి అవగాహన కల్పించి, అర్హులైన వినియోగదారులకు ఎలాంటి జాప్యం లేకుండా ప్రయోజనం అందేలా చర్యలు తీసుకుంటున్నారు.

ప్రభుత్వ తాజా నిర్ణయం ప్రకారం.. రెండు నెలలకు 500 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించే గృహాలకు 200 యూనిట్ల వరకు ఉచితంగా సరఫరా చేయనున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో మొత్తం 2.46 కోట్ల గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇప్పటి వరకు 100 యూనిట్లలోపు వినియోగించే 67 లక్షల కుటుంబాలు సున్నా బిల్లు ప్రయోజనం పొందుతున్నాయి. తాజా విస్తరణతో ఈ సంఖ్య 1.2 కోట్ల కుటుంబాలకు పెరగనుందని అంచనా వేస్తున్నారు. అదే సమయంలో మరో 85.83 లక్షల మంది వినియోగదారుల విద్యుత్ బిల్లులు ప్రతి రెండు నెలలకు సుమారు రూ.235 వరకు తగ్గే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అయితే 500 యూనిట్లకు మించి వినియోగించే 34.24 లక్షల కుటుంబాలకు మాత్రం పాత విధానంలో ఉన్న 100 యూనిట్ల ఉచిత విద్యుత్ ప్రయోజనం కొనసాగనుంది. ఈ పథకం వల్ల ఏర్పడే అదనపు ఆర్థిక భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని అధికారులు స్పష్టం చేశారు. మే 10న ప్రభుత్వం ఈ నిర్ణయం ప్రకటించగానే సాఫ్ట్‌వేర్ అప్‌గ్రేడ్ పనులు ప్రారంభించినట్లు వెల్లడించారు. ప్రజల జీవన వ్యయాన్ని తగ్గిస్తూ సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

# అమెరికా-ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం?

- **60 రోజుల కాల్పుల విరమణపై కీలక చర్చలు**
- **హర్మూజ్ జలసంధి తెరవడానికి ఇరాన్ సిద్ధం**

అమెరికా, ఇరాన్ మధ్య నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతలు తగ్గే సూచనలు కనిపిస్తున్నాయి. ఇరు దేశాలు 60 రోజుల కాల్పుల విరమణ ఒప్పందానికి దగ్గరయ్యాయని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. ఈ ఒప్పందానికి సంబంధించిన చర్చలు తుది దశకు చేరుకున్నాయని సమాచారం. ఒప్పందంలో భాగంగా ఇరాన్ చమురు విక్రయాలకు అనుమతులు, హర్మూజ్ జలసంధి పునరుద్ధరణ, అణు కార్యక్రమంపై నియంత్రణ వంటి కీలక అంశాలు చర్చలో ఉన్నట్లు తెలుస్తోంది. ఆక్సియోస్ కథనం ప్రకారం.. హర్మూజ్ జలసంధిని ఎలాంటి సుంకాలు లేకుండా తిరిగి తెరవడానికి ఇరాన్ అంగీకరించినట్లు సమాచారం. అక్కడ నౌకల రాకపోకలకు అడ్డంకిగా ఉన్న మైన్‌లను తొలగించేందుకు కూడా సిద్ధమైందని పేర్కొంది. దీనికి బదులుగా అమెరికా ఇరాన్ ఓడరేవులపై అమలు చేస్తున్న దిగ్బంధనాన్ని ఎత్తివేయనుంది.



అలాగే ఇరాన్ చమురు విక్రయాలపై ఉన్న కొన్ని ఆంక్షలను సడలించడంతో పాటు స్తంభింపజేసిన నిధులను విడుదల చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. అయితే ఈ ఒప్పందంలో అత్యంత కీలకమైన అణు కార్యక్రమం అంశంపై మాత్రం ఇరు దేశాల మధ్య ఇంకా భిన్నాభిప్రాయాలు కొనసాగుతున్నాయి. అణ్వాయుధాల తయారీ చేపట్టబోమని, యురేనియం శుద్ధిని నిలిపివేస్తామని ఇరాన్ హామీ ఇవ్వాలని అమెరికా కోరుతున్నట్లు సమాచారం. కానీ ప్రాథమిక చర్చల్లో అణు కార్యక్రమం అంశం లేదని ఇరాన్ అధికారులు చెబుతున్నారు. ఇరు దేశాలు ముందుగా ప్రాథమిక అవగాహనకు రావాలని, ఆ తర్వాతే క్లిష్ట అంశాలపై చర్చలు జరుగుతాయని న్యూయార్క్ టైమ్స్ నివేదించింది.

భారత్ పర్యటనలో ఉన్న అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఈ ఒప్పందంపై ప్రపంచం త్వరలోనే శుభవార్త వినే అవకాశం ఉందని వ్యాఖ్యానించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా చర్చలు చాలావరకు కొలిక్కి వచ్చాయని, తుది రూపు ఇవ్వాల్సి ఉందని పేర్కొన్నారు. మరోవైపు ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఖాయీ మాట్లాడుతూ.. సానుకూల వాతావరణం ఉన్నప్పటికీ కీలక అంశాలపై ఇంకా పూర్తి ఒప్పందం కాలేదన్నారు. ఈ చర్చలకు మధ్యవర్తిత్వం వహిస్తున్న పాకిస్థాన్ త్వరలోనే మరో విడత చర్చలు నిర్వహించాలని ఆశిస్తున్నట్లు ప్రధాని షెహబాజ్ షరీఫ్ తెలిపారు. ఇదే సమయంలో అమెరికా మళ్లీ యుద్ధానికి దిగితే తీవ్రమైన పరిణామాలు ఉంటాయని ఇరాన్ చీఫ్ నెగోషియేటర్ మహమ్మద్ బఘేర్ ఘలీబాఫ్ హెచ్చరించడం పరిస్థితుల తీవ్రతను స్పష్టం చేస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా ఈ శాంతి చర్చలపై ఆసక్తి నెలకొంది. ఒకవేళ ఈ ఒప్పందం కుదిరితే మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు తగ్గడంతో పాటు అంతర్జాతీయ చమురు మార్కెట్లపై కూడా ప్రభావం పడే అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

# పాకిస్తాన్‌లో ఘోర పేలుడు

- **రైలును ఢీకొన్న కారు..**
  **భారీ విస్ఫోటనం**

పాకిస్తాన్ దేశంలో భారీ పేలుడు సంభవించింది. బలూచిస్తాన్ ప్రావిన్స్‌లోని క్వెట్టా నగరంలోని చమాన్ పాతక్ రైల్వే స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనలో 24 మంది ప్రాణాలు కోల్పోగా, 50 మందికిపైగా గాయపడినట్లు అధికారులు తెలిపారు. మృతుల్లో ఎక్కువ మంది పాక్ ఆర్మీ జవాన్లు, వారి కుటుంబ సభ్యులే ఉన్నట్లు సమాచారం. స్థానిక మీడియా కథనాల ప్రకారం.. ఆర్మీ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులతో ప్రయాణిస్తున్న రైలు స్టేషన్ సమీపంలోని సిగ్నల్ దాటుతున్న సమయంలో పేలుడు పదార్థాలతో నిండిన ఒక కార్ ఒక్కసారిగా ట్రాక్‌పైకి దూసుకొచ్చింది. అనంతరం ఆ కార్ రైలును ఢీకొట్టడంతో భారీ పేలుడు సంభవించింది. పేలుడు తీవ్రతతో రైలు బోగి పూర్తిగా ధ్వంసమైంది. సమీపంలో పార్క్ చేసిన పలు వాహనాలు కూడా నాశనమయ్యాయి. పేలుడు ధాటికి కార్ల గాజు ముక్కలు, ఇనుప భాగాలు గాల్లోకి ఎగిరి సమీప భవనాలపై పడ్డాయి. ఒక్కసారిగా భారీ శబ్దం రావడంతో ప్రజలు భయాందోళనకు గురై పరుగులు తీశారు. ఘటనాస్థలంలో పొగలు కమ్ముకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. సమాచారం అందుకున్న పోలీసులు, భద్రతా సిబ్బంది వెంటనే సహాయక చర్యలు ప్రారంభించారు. గాయపడిన వారిని సమీప ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనను అధికారులు ఆత్మాహుతి దాడిగా అనుమానిస్తున్నారు. పేలుడు వెనుక ఉగ్రవాద కోణంపై దర్యాప్తు ప్రారంభించారు. ఘటనాస్థలాన్ని పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకున్న భద్రతా బలగాలు సోదాలు నిర్వహిస్తున్నాయి. రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలను మూసివేసి ప్రజల రాకపోకలను నిలిపివేశారు. ఘటన అనంతరం క్వెట్టాలోని అన్ని ఆస్పత్రుల్లో అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. డాక్టర్లు, నర్సులు, ఇతర సిబ్బంది సెలవులను రద్దు చేసి వెంటనే విధులకు హాజరు కావాలని ఆదేశాలు జారీ చేశారు. బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రభుత్వం సూచించింది. నగరవ్యాప్తంగా హై అలర్ట్ ప్రకటించి భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. ప్రమాదం నేపథ్యంలో కొన్ని రైళ్లను అధికారులు రద్దు చేశారు. ఈ ఘటనతో పాకిస్తాన్‌లో మరోసారి భద్రతా పరిస్థితులపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# బన్నీ సలహాతో మారిన నటన.. ప్రభాస్‌పై కాజల్ ఆసక్తికర కామెంట్స్



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ గతంలో ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన సహనటుల గురించి చెప్పిన ఆసక్తికర విషయాలు ఇప్పుడు మరోసారి సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా అల్లు అర్జున్ ఇచ్చిన ఓ విలువైన సలహా తన నటనలో ఎంతో మార్పు తీసుకువచ్చిందని, ప్రభాస్‌తో నటించిన అనుభవం చాలా ప్రత్యేకమని కాజల్ చెప్పిన మాటలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. సినిమా సెట్లలో అందరితోనూ మంచి అనుబంధం ఉండేదని తెలిపిన కాజల్.. సహనటుల నుంచి వచ్చే సూచనలను తాను ఎప్పుడూ స్వాగతిస్తానని పేర్కొన్నారు. కొన్నిసార్లు వాళ్లు చెప్పిన చిన్న చిన్న విషయాలే నటనలో పెద్ద మార్పు తీసుకువస్తాయని అన్నారు. అలాంటి ఒక ముఖ్యమైన సూచన తనకు అల్లు అర్జున్ నుంచి వచ్చిందని గుర్తుచేసుకున్నారు. తాను సహజంగానే చాలా చురుకైన వ్యక్తినని, దర్శకుడు "కట్" అని చెప్పగానే వెంటనే ఆ సన్నివేశంలోని భావోద్వేగం నుంచి బయటకు వచ్చేసేదాన్నని కాజల్ తెలిపారు. అయితే అల్లు అర్జున్ మాత్రం "కెమెరా పూర్తిగా ఆగే వరకు ఆ భావోద్వేగాన్ని అలాగే కొనసాగించాలి" అని చెప్పారని వెల్లడించారు. అలా చేస్తే ఎడిటింగ్ సమయంలో సన్నివేశం మరింత సహజంగా కనిపిస్తుందని బన్నీ వివరించాడని చెప్పారు. ఆ సలహా తనకు ఎంతో ఉపయోగపడిందని, ఇప్పటికీ అదే పద్ధతిని పాటిస్తున్నానని కాజల్ వెల్లడించారు. ఇక సహనటుల ఎత్తు గురించి మాట్లాడిన కాజల్.. తనతో నటించిన హీరోలు చాలా పొడవుగా ఉండేవారని సరదాగా చెప్పారు. అందుకే తాను సాధారణంగా ఎక్కువ ఎత్తైన హీల్స్ ధరించేదాన్ని కాదని తెలిపారు. ఎక్కువగా ఒకటి లేదా రెండు అంగుళాల హీల్స్ మాత్రమే వేసుకునేదాన్నని పేర్కొన్నారు. అయితే ప్రభాస్‌తో కలిసి నటించిన సమయంలో మాత్రం తనకు మంచి కంఫర్ట్ ఫీలింగ్ ఉండేదని కాజల్ అన్నారు. "డార్లింగ్" సినిమా సమయంలో ప్రభాస్ ఎత్తు కారణంగా తాను నాలుగు నుంచి ఆరు అంగుళాల వరకు ఉన్న హీల్స్ కూడా ధరిచానని చెప్పారు. స్టిలెటోస్ వేసుకుని సౌకర్యంగా నటించగలిగానని గుర్తుచేసుకున్నారు. ప్రభాస్‌తో పని చేయడం చాలా హ్యాపీ అనుభవమని తెలిపారు.

గ్లామర్ గురించి కూడా కాజల్ తన అభిప్రాయాన్ని వెల్లడించారు. గ్లామర్ అంటే కేవలం అందాల ప్రదర్శన కాదని, నటనలోని సొగసు కూడా అంతే ముఖ్యమని అన్నారు. చీరలోనైనా, పూర్తి చేతుల దుస్తుల్లోనైనా ఒక నటి ఎంతో ఆకర్షణీయంగా కనిపించవచ్చని చెప్పారు. సొగసుకు, అసభ్యతకు మధ్య చాలా సున్నితమైన గీత ఉంటుందని, తాను ఎప్పుడూ ఆ గీత దాటేలా ప్రవర్తించనని స్పష్టం చేశారు.

తన కుటుంబ సభ్యులతో కలిసి చూసేందుకు ఇబ్బంది కలిగించేలా ఎప్పుడూ పాత్రలు చేయనని కూడా కాజల్ పేర్కొన్నారు. నటిగా గ్లామర్ కంటే నటనకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తానని, అదే తనకు ముఖ్యమని తెలిపారు. ప్రస్తుతం కాజల్ చేసిన ఈ వ్యాఖ్యలు మరోసారి అభిమానుల్లో చర్చనీయాంశంగా మారాయి.




# ఏడేళ్ల ప్రేమ.. పెళ్లి తర్వాత జీవితం గురించి అవికా గోర్ ఆసక్తికర వ్యాఖ్యలు

చిన్న వయసులోనే టెలివిజన్ ప్రపంచంలో స్టార్‌డమ్ సంపాదించి, తర్వాత తెలుగు సినీ ప్రేక్షకులకు దగ్గరైన నటి అవికా గోర్ తాజాగా తన వ్యక్తిగత జీవితం, ప్రేమ వివాహం, కెరీర్ ప్రయాణం గురించి ఆసక్తికర విషయాలను వెల్లడించారు. ఇటీవల విడుదలైన "అగ్లీ స్టోరీ" సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఆమె, ఓ ఇంటర్వ్యూలో తన జీవితంలోని ఎన్నో మధుర జ్ఞాపకాలను పంచుకున్నారు. బాలనటిగా "బాలికా వధు" సీరియల్ ద్వారా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన అవికా.. ఆ పాత్ర తన జీవితాన్నే మార్చేసిందని చెప్పారు. తాను ముంబైలో పెరిగినా, రాజస్థానీ భాష అసలు తెలియదని, అయినప్పటికీ ఆ పాత్ర కోసం ఎంపిక కావడం తన అదృష్టమని తెలిపారు. ఆ సీరియల్ విజయం తన కెరీర్‌కు బలమైన పునాది వేసిందని పేర్కొన్నారు. తర్వాత కేవలం 15 ఏళ్ల వయసులోనే "ఉయ్యాల జంపాల" సినిమాతో తెలుగు తెరకు పరిచయం కావడం పూర్తిగా అనుకోకుండా జరిగిందని అవికా చెప్పారు. అసలు తాను హీరోయిన్ అవుతానని, ముఖ్యంగా తెలుగు సినిమాల్లో నటిస్తానని ఎప్పుడూ ఊహించలేదని తెలిపారు. కానీ వచ్చిన అవకాశాలను నమ్మకంతో స్వీకరించడంతో తన ప్రయాణం అద్భుతంగా సాగిందని చెప్పారు. ఇక తన ప్రేమ వివాహం గురించి మాట్లాడుతూ.. తమ ఇద్దరి పరిచయం దాదాపు ఏడేళ్ల నాటిదని వెల్లడించారు. ఒకరినొకరు బాగా అర్థం చేసుకున్న తర్వాతే పెళ్లి నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. తమ ప్రేమ విషయాన్ని ఇంట్లో చెప్పిన తర్వాత తన తల్లి చాలా తక్కువ సమయంలోనే అంగీకరించారని, కుటుంబ సభ్యుల మద్దతు తమ బంధాన్ని మరింత బలపరిచిందని తెలిపారు. పెళ్లి తర్వాత జీవితం గురించి మాట్లాడిన అవికా.. దాంపత్య జీవితం ఎంతో సంతోషంగా సాగుతోందని చెప్పారు. ఒకరిపై మరొకరికి గౌరవం ఉండటం తమ బంధానికి ప్రధాన బలం అని పేర్కొన్నారు. వ్యక్తిగత ఎదుగుదలకు పరస్పరం మద్దతు ఇస్తూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. సామాజిక మాధ్యమాల ప్రభావం తమ సంబంధంపై అసలు ఉండదని, నిజమైన జీవితాన్ని నిజాయితీగా జీవించడానికే ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. తన భర్త కార్పొరేట్ రంగంలో సీనియర్ ప్రొడక్ట్ మేనేజర్‌గా పనిచేస్తున్నారని, ప్రముఖ విద్యాసంస్థలో చదివారని అవికా వెల్లడించారు. ప్రస్తుతం ఆయన బ్యాంకాక్‌లో ఉద్యోగం చేస్తున్నారని, తాను కూడా ఎక్కువ సమయం అక్కడే గడుపుతున్నానని చెప్పారు. అయితే సినిమా షూటింగ్స్ కోసం తరచూ భారత్‌కు వస్తూ ఉంటానని తెలిపారు. తమ కెరీర్లు పూర్తిగా వేర్వేరు అయినప్పటికీ, ఒకరి పనిని మరొకరు గౌరవించుకుంటామని అవికా చెప్పారు. ముఖ్యంగా తన భర్త తనను కేవలం నటిగా కాకుండా, వ్యక్తిగా అర్థం చేసుకుంటారని తెలిపారు. తన వృత్తి వల్ల కాకుండా, తన వ్యక్తిత్వాన్ని ప్రేమించడం తనకు ఎంతో ఆనందాన్ని ఇస్తుందని చెప్పారు. కెరీర్ విషయానికి వస్తే.. ఏ సినిమా విజయం సాధిస్తుందో, ఏది ఆశించిన ఫలితం ఇవ్వదో ముందుగా చెప్పడం చాలా కష్టమని అవికా అభిప్రాయపడ్డారు. తన జీవితంలో చాలా విషయాలు అనుకోకుండా జరిగాయని, అందుకే భవిష్యత్తు గురించి ఎక్కువగా ఆలోచించడం మానేశానని తెలిపారు. భవిష్యత్తులో రాజకీయాల్లోకి వచ్చే అవకాశంపై కూడా అవికా స్పందించారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in